ప్రజాశక్తి

ఆదివారం 3 నవంబర్ 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

రాష్ట్ర భవిష్యత్తును మార్చే కొత్త ప్రణాళికలు

విశాఖ కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న చంద్రబాబు

- మున్ముందు వీటితోనే అభివృద్ధి అడుగులు
- సంక్రాంతికి రహదారుల గుంతల పనులు పూర్తి
- డ్వాక్రా మహిళలకు డ్రోన్లు
- 175 నియోజకవర్గాల్లో పారిశ్రామిక పార్కులు
- రుషికొండ పేలస్ ఖరీదైన ప్రయోగం
- విశాఖ, అనకాపల్లి పర్యటనల్లో సిఎం చంద్రబాబు

రుషికొండ పేలస్‌లో నిర్మాణాలను పరిశీలిస్తున్న చంద్రబాబు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, అనకాపల్లి ప్రతినిధి, పరవాడ విలేకరి

రాష్ట్ర భవిష్యత్తును మార్చే సరికొత్త ప్రణాళికలను మున్ముందు తీసుకురానున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. విశాఖ మెట్రో ప్రాజెక్టు, మాస్టర్ ప్లాన్, నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో గ్రోత్ హబ్, రోడ్ల అనుసంధానం తదితర అన్ని అభివృద్ధి పనుల్లో పిపిపి విధానానికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు. అధికారులు హార్డ్ వర్క్ కాదు... స్మార్ట్ వర్క్ చేయాలని ఉద్బోధించారు. సిఎం విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో శనివారం పర్యటించారు. చివరిగా విశాఖ కలెక్టరేట్‌లో పలు విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖలో పర్యాటక అభివృద్ధికి పెద్దపీట వేయాలన్నారు. విజయనగరం, నెల్లిమర్ల, భోగాపురం, అనకాపల్లి ప్రాంతాలను విశాఖకు అనుసంధానం చేస్తూ ఔటర్ రింగ్ రోడ్డు

వెన్నెలపాలెం సభలో మాట్లాడుతున్న చంద్రబాబు

వేసేందుకు ప్రణాళిక రూపొందించాలన్నారు. హైదరాబాద్ మాదిరిగా విశాఖ అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. విశాఖపట్నం అంటే తనకు అపారమైన ఇష్టమన్నారు. ఈ నగరానికి ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. చిన్న పిల్లలకు ఆహ్లాదాన్ని పంచే పార్కులను ఈ నగరంలో మరిన్ని ఏర్పాటు చేయాలన్నారు. పక్కా డ్రైనేజీ సిస్టమ్‌ను అందుబాటులోకి తేవాలన్నారు.

సమీక్షా సమావేశానికి ముందు ఆయన విశాఖలోని రుషికొండపై ఎపి టూరిజం ఆధ్వర్యాన నిర్మాణం చేసిన ఏడు భవనాలను శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 4.30 గంటల వరకూ పరిశీలించారు. భవనాల మీద నుంచి సముద్రపు అలలను, తీర దృశ్యాలను చూసి ఒకింత ఆశ్చర్యానికి గురవ్వడం కనిపించింది. విజయనగర పేలస్ నుంచి సీ వ్యూను చూస్తూ పులకించిపోయారు. భవనాల పర్యటన అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ జగన్ మిగతా 2లో..

నిర్బంధానికి కొత్త తొడుగు !

వార్త 2లో..

ఆవు పాలు సేకరణ ధర వెంటనే పెంచాలి

వార్త 5లో..

అభిజిత్ లే ఆఫ్‌పై ముఖ్యమంత్రి దృష్టి సారించాలి

వార్త 5లో..

గంగకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలి

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

గంగను పరామర్శిస్తున్న నర్సింగరావు, మణి తదితరులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ, విశాఖ కలెక్టరేట్

ఎంవిపి పోలీసుల దాడిలో కాలు విరిగి బాధపడుతున్న ఇంటి పనిమనిషి గంగకు రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు డిమాండ్ చేశారు. సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్‌లో పనిచేస్తున్న గంగపై ఎంవిపి పోలీసులు తీవ్రంగా లాఠీఛార్జి చేయడం వల్ల ఆమె కాలు విరిగిపోయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం నర్సింగరావు బాధితురాలు గంగను ఆర్ అండ్ బి సమీపంలోని అంబేద్కర్ నగర్‌లో ఆమె ఇంటికి వెళ్లి పరామర్శించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి పి.మణి, పి.వెంకటరావు, సిపిఎం మిగతా 2లో..

అగర్తల - సికింద్రాబాద్ మధ్య వన్ వే ప్రత్యేక రైలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పండగ సీజన్‌లో ప్రయాణికుల అదనపు రద్దీని నియంత్రించేందుకు అగర్తల నుండి సికింద్రాబాద్‌కు వన్ వే ప్రత్యేక రైలును నడపాలని రైల్వే నిర్ణయించింది. ఈ క్రమంలో 05629 అగర్తల - సికింద్రాబాద్ వన్ వే ప్రత్యేక రైలు నవంబర్ 3 ఆదివారం ఉదయం 6.20 గంటలకు అగర్తలలో బయలుదేరి సోమవారం తెల్లవారుజామున 03.35 గంటలకు దువ్వాడ చేరుకొని మిగతా 2లో..

ఉత్తరాంధ్ర అభివృద్ధికి మీ చర్యలేంటి ?

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర జిల్లాల్లో ప్రజల జీవన ప్రమాణాలను పెంచే అభివద్ధి పనులను రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వేటిని చేపట్టనుందో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన శనివారం విశాఖలో ఓ ప్రకటన విడుదల చేశారు. చంద్రబాబు శుక్రవారం శ్రీకాకుళం జిల్లా పర్యటనలో మాట్లాడుతూ ఆ జిల్లాలో విమానాశ్రయం, మూలపేట వద్ద పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు వంటి అంశాలపై హామీ ఇచ్చారని, అయితే ఇవేవీ అక్కడి ప్రజలు కోరుకున్నవికావని, ప్రజల జీవన ప్రమాణాలు పెంచేవీ కాదని అజశర్మ పేర్కొన్నారు. రాష్ట్రంలో అనకాపల్లి, కాకినాడ, నెల్లూరు జిల్లాల్లో పారిశ్రామిక కారిడార్ల పేరున వేలాది ఎకరాల భూమిని రైతుల నుంచి బలవంతంగా సేకరించారని, కానీ అక్కడ వచ్చిన పరిశ్రమలూ లేవు, ఉపాధీ లేదని తెలిపారు. నవంబరు 1న రాష్ట్ర అవతరణ దినోత్సవంకాగా, దురదృష్టకరంగా రాష్ట్ర ప్రభుత్వం దీనిని జరపలేదని విమర్శించారు.

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జుల నియామకం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జిలను పిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిల నియమించారు. రాష్ట్రంలో 175 నియోజకవర్గాలు ఉండగా 62 నియోజకవర్గాల పార్టీ ఇన్‌ఛార్జులను నియమిస్తూ శనివారం ఆమె ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు నియోజకవర్గం ఇన్‌ఛార్జిగా సతక బుల్లిబాబు నియమితులుకాగా విశాఖ జిల్లా ఉత్తర ఇన్‌ఛార్జిగా అడ్డాల వెంకట వర్మ రాజు (హాసిని వర్మ), పశ్చిమ నియోజకవర్గం ఇన్‌ఛార్జిగా కొత్తల వెంకట సూర్యనారాయణ, గాజువాక నియోజకవర్గం ఇన్‌ఛార్జిగా లక్కరాజు రామారావు నియమితులయ్యారు.

అనకాపల్లి జిల్లాలోని నర్సీపట్నం నియోజకవర్గం ఇన్‌ఛార్జిగా కచ్చల చినబాబు, అనకాపల్లి నియోజకవర్గం ఇన్‌ఛార్జిగా మలుపురెడ్డి కోటేశ్వరరావు, యలమంచిలి నియోజకవర్గం ఇన్‌ఛార్జిగా తనకాల అనంతరామ నర్సింగరావు, చోడవరం నియోజకవర్గం ఇన్‌ఛార్జిగా గూడూరు వెంకటరావు నియమితులయ్యారు.

రైల్వే స్టేషన్‌లో..

14 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ రైల్వే స్టేషన్‌లో 14 కిలోల గంజాయిని రైల్వే పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. విశాఖపట్నం జిఆర్‌పి ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో సబ్ ఇన్‌స్పెక్టర్ అబ్దుల్ మారూఫ్, ఆర్‌పిఎఫ్ ఎఎస్‌ఐ చిట్టిబాబు సిబ్బందితో కలిసి విశాఖపట్నం రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారాల్లో ముమ్మర తనిఖీలు చేస్తుండగా పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన గడదేస గణపతి ఉత్తరప్రదేశ్ లోని వారణాసికిగంజాయిని తరలిస్తూ పట్టుబడ్డాడు. ఆయన్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

మొదటి పేజీ తరువాయి..

రాష్ట్ర భవిష్యత్తును మార్చే కొత్త ప్రణాళికలు

భోగవిలాసాల కోసం, వ్యక్తిగత స్వార్థం కోసం ఈ నిర్మాణం చేసుకున్నాడంటూ రాజకీయ దాడి చేశారు. ఇక్కడ కొండను, చుట్టూ ఉన్న ప్రకృతిని నాశనం చేసి జగన్ అధికారులను, నాయకులను అందరినీ బెదిరించి రుషికొండపై అక్రమ నిర్మాణం చేస్తున్నట్లు అప్పట్లో ప్రపంచమంతా కోడై కూసిందని, జనసేన, బిజెపి, ఎన్‌జిటి ప్రతినిధులు ఎవ్వరినీ జగన్ నాడు రానివ్వలేదని, తనను కూడా రుషికొండపైకి అడుగుపెట్టనివ్వలేదని చంద్రబాబు చెప్పారు. ప్రభుత్వాన్ని అడ్డం పెట్టుకుని ఈ నిర్మాణం చేశాడన్నారు. ప్రజాస్వామ్యంలో జగన్ లాంటి పాలకుడు ఉండకూడదని ప్రజలు 2024లో తీర్పునిచ్చారన్నారు. మళ్లీ జగన్ గెలిస్తే ఈ సముద్రాన్ని కూడా ఉంచడనే విశాఖ, రాష్ట్ర ప్రజలు ఓడించారన్నారు. రుషికొండపైకి ప్రజలను అనుమతిస్తామన్నారు. ప్రజల నుంచి రుసుం ఏమైనా వసూలు చేస్తారా ? అని అడగ్గా ఇంకా ఆ విషయమై నిర్ణయం చేయలేదన్నారు. సిఎం వెంట రాష్ట్ర టూరిజం మంత్రి కందుల దుర్గేష్, విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధ్రప్రసాద్, ఎపి టూరిజం మేనేజింగ్ డైరెక్టర్ అభిషిక్త్, ఐఎఎస్‌లు వినయ్‌చంద్, జివిఎంసి కమిషనర్ సంపత్ కుమార్, విశాఖ ఎంపీ శ్రీభరత్, ఎంఎల్‌ఎలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, పల్లా శ్రీనివాసరావు ఉన్నారు.

గుంతల రహిత రహదారులే లక్ష్యం

రాష్ట్రంలో సంక్రాంతి నాటికి రహదారుల గుంతలు పూడ్చే పని పూర్తవుతుందని చంద్రబాబు నాయుడు అన్నారు. గుంతల రహిత రహదారుల కోసం రూ.860 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. అనకాపల్లి జిల్లా పరవాడ మండలం వెన్నెలపాలెం కూడలిలో శనివారం రహదారి గుంతల పనుల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారులు బాగుంటే పరిశ్రమలతో రాకతో పాటు అనేక ప్రయోజనాలున్నాయన్నారు. గ్రామాల్లో పంటలు, వనరుల ఆధారంగా చిన్నచిన్న పరిశ్రమల ఏర్పాటుచేయనున్నామన్నారు. డ్రోన్లతో పంట పొలాలకు క్రిమి సంహారక, పురుగుమందులు జల్లడానికి డ్వాక్రా మహిళలకు డ్రోన్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. 175 ఇండస్ట్రియల్ పార్కుల్లో స్థానికులను ప్రోత్సహిస్తామన్నారు. రహదారులు, భవనాల శాఖ మంత్రి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ పిపిపిలో చేయబోయే రహదారి పనులపై సర్వే చేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో జరిగిన పనులకు రూ.200 కోట్లు పెండింగ్ బిల్లులు చెల్లించామన్నారు. కార్యక్రమంలో ఆ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, మంత్రులు వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, యలమంచిలి, మాడుగుల ఎమ్మెల్యేలు సుందరపు విజయకుమార్, బండారు సత్యనారాయణమూర్తి, కలెక్టర్ విజయకృష్ణన్, మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ, హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు తదితరులు పాల్గొన్నారు.

గంగకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలి

మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ గంగను పరామర్శించిన వారిలో ఉన్నారు. అనంతరం సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెఎం.శ్రీనివాస్, ఆర్‌కెఎస్‌వి.కుమార్, నాయకులు బి.జగన్, కెఎం.కుమార్ మంగళం, జి.అప్పలరాజు, కె.కుమారి తదితరులు కూడా వెళ్లి వారి కుటుంబానికి రెండు నెలలకు సరిపోయేటువంటి ఆహార ధాన్యాలను అందజేశారు. ఈ సందర్భంగా పోలీసుల ప్రవర్తించిన తీరును తీవ్రంగా ఆక్షేపించారు. వారిపై పోలీస్ కమిషనర్ తీసుకున్న చర్యలను అభినందించారు. పేదలకు సిఐటియు అన్నివేళలా అండగా ఉంటుందన్నారు. ఇంటి పని వారికి రావలసిన హక్కులను, చట్టాలను అమలు పరిచేందుకు కృషి చేస్తామని తెలిపారు. బాధితురాలు గంగను ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఒంటరి మహిళగా ఉన్న గంగకు ప్రభుత్వం తరుపున ఇల్లు కేటాయించాలని, ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు.

అగర్తల - సికింద్రాబాద్ మధ్య వన్ వే ప్రత్యేక రైలు

మరలా 03.40 గంటలకు బయలుదేరి అదేరోజు సాయంత్రం 16.15 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ రైలు ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలో బాలాసోర్, భద్రక్, కటక్, భువనేశ్వర్, ఖుర్దా రోడ్, బ్రహ్మపూర్, శ్రీకాకుళం రోడ్, విజయనగరం, దువ్వాడ మీదుగా ప్రయాణిస్తుంది.

వాహనదారులకు ఇబ్బంది లేకుండా గుంతలు పూడ్చండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వాహనదారులకు ఇబ్బంది లేకుండా రోడ్లపై గుంతలను పూడ్చాలని రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ ఆదేశించారు. శనివారం ఆయన విశాఖ నగరంలోని సిరిపురం దత్ ఐల్యాండ్ జంక్షన్ వద్ద విశాఖపట్నం ఇన్‌ఛార్జి మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, పార్లమెంటు సభ్యులు ఎం.శ్రీభరత్, తూర్పు నియోజకవర్గం శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు, జివిఎంసి కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్‌లతో కలిసి జంక్షన్‌లోని గుంతలను పూడ్చారు.

హెచ్ఎస్ఎల్‌లో ముగిసిన విజిలెన్స్ వారోత్సవాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖలోని హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో వారం రోజులుగా నిర్వహిస్తున్న విజిలెన్స్ వారోత్సవాలు శనివారంతో ముగిశాయి. వీటిని 'సాంస్కృతిక సమగ్రత కోసం.. దేశ శ్రేయస్సు కోసం..' థీమ్‌తో నిర్వహించారు. అక్టోబర్ 28న ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించడంతో ఈ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో భాగంగా సభలు, వ్యాసరచన, నినాదాల పోటీలు చేపట్టారు. విక్రేతలు, కాంట్రాక్టర్ల కోసం ఇంటరాక్షన్ సెషన్లను నిర్వహించారు. పిల్లలలో సామాజిక బాధ్యతపై అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలు చేపట్టారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ముగింపు వేడుకల్లో భాగంగా శనివారం హిందుస్థాన్ షిప్ యార్డ్ లిమిటెడ్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కమాండర్ హేమంత ఖత్రీ మాట్లాడుతూ నిజాయితీ, సమగ్రత, నిర్దేశించిన నియమాలు, విధానాలకు కట్టుబడి ఉండటం, వాటి ప్రాముఖ్యతలను తెలియజేశారు. ప్రతి ఒక్కరూ అవినీతిని వ్యతిరేకించాలని కోరారు.

నిర్బంధానికి కొత్త తొడుగు !

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

ప్రజాస్వామిక విలువలు, హక్కులపై విశ్వాసం లేనివారు అవసరాల రీత్యా వాటి గొప్పతనాన్ని వల్లె వేస్తారు. గొప్ప ప్రజాస్వామికవాదిలా ఇతరుల కళ్లకు కనబడాలని విపరీత తాపత్రయం ప్రదర్శిస్తారు. తమ చమత్కారం, సమయస్ఫూర్తి, లేదా అధికార మదంతో తమకు లేని గొప్పతనాన్ని ఉన్నట్లు మాట్లాడ్డానికి అలవాటుపడతారు. వ్యక్తి వాస్తవిక నైజం, స్వభావం గుర్తించనంతకాలం పెద్ద మనుషులుగా ఈ తరహా వ్యక్తులు చలామణి అయిపోతారు. చిన్నదో, పెద్దదో అధికారం, హోదా తోడైతే విలువలకు విలువ ఇవ్వనివారు కూడా తామే అసలైన విలువల పరిరక్షకులుగా తమతమకు ఆపాదించుకొని ఊరేగుతారు. ప్రజల కష్టసుఖాలు తెలిసిన ప్రభుత్వాల్లో ప్రాతినిధ్యం కలిగిన పెద్దలు గురించి ఇక చెప్పనక్కర్లేదు. పరవాడ మండలం వెన్నెలపాలెం కూడలిలో రహదారుల గుంతలు పూడ్చే పనుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి శనివారం వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు సుదీర్ఘ ప్రసంగం చేశారు. తాను మారానని, అధికారులు పాత వాసనలు పోగొట్టుకోవాలని, తానొచ్చినప్పుడు రెడ్ కార్పెట్లు వేయొద్దని, వృథా ఖర్చులు చేయొద్దని పలుమార్లు సెలవిచ్చారు. ఆ దర్పానికి దాసోహులు అంత తేలిగ్గా అనుభవ అనుభూతులు వదులుకుంటారని అనుకోలేము. వాళ్లను అనుసరించి, అనుకరించి పెరిగిన, పెరుగుతున్న వారు వేరే మార్గంలో ప్రయాణం చేస్తారని భావించలేము.

చంద్రబాబు ఎంత చెప్పుకున్నా, కూటమి ప్రభుత్వమేమీ ప్రజాస్వామిక ప్రతీక కాదు. గత ప్రభుత్వ, లేదా అంతకుముందున్న, ఇప్పటి కూటమి ప్రభుత్వాలకేమీ తేడాలేదు. ప్రజా, కార్మికవర్గ సమస్యలపై వినతిపత్రం ఇవ్వడానికి సిపిఎం, సిఐటియు ఇతర ప్రజా సంఘాల నాయకులకు అవకాశం లేకుండా గృహ నిర్బంధం చేయడం, పోలీసు స్టేషన్‌కు

తీసుకెళ్లడం గత ప్రభుత్వంలో సాగింది. సభకొచ్చిన ముఖ్యమంత్రి తిరిగి వెళ్లేవరకు నాయకులను పోలీసులు వదిలేవారు కాదు. తమ ప్రభుత్వం అటువంటిది కాదని వెన్నెలపాలెం కూడలి సభలో చంద్రబాబు ఎంత చెప్పుకున్నా, గత ప్రభుత్వానికి భిన్నమైన ప్రభుత్వమేమీ కాదిది. 'గృహ నిర్బంధాల్లేవు, పోలీసుల అడ్డగింతలు లేవు' అని బాబు చెప్పడం వెనుక, అవి లేవని కాదు. ప్రజల పక్షాన మాట్లాడేవారు, పౌర సమస్యలను బలంగా వినిపించేవారి గొంతును నొక్కేందుకు ఎంచుకున్న పద్ధతులు వేరన్న అర్థంలో మాట్లాడినట్లుంది. చట్ట విరుద్ధంగా లే ఆఫ్ విధించిన అభిజిత్ ఫెర్రోటెక్ కంపెనీ యాజమాన్యంపై చర్య తీసుకోవాల్సిన ప్రభుత్వం ఆ పనిచేయకపోగా, లే ఆఫ్ ఎత్తివేయించి ఉపాధి కల్పించాలని సిఎంకు వినతిపత్రమివ్వడానికి వస్తున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రాము, కార్మికులను అచ్యుతాపురం పోలిమేర దాటనివ్వలేదు. వెళ్లడానికి అనుమతిచ్చి వెళ్లనీయకుండా అడ్డుకోవడంలోనే ప్రభుత్వ నిర్బంధపు చాకచక్యం అర్థమవుతోంది. పరవాడ ఫార్మా కంపెనీల కాలుష్యంతో ప్రజలు పడుతున్న బాధలను సిఎం దృష్టికి తీసుకెళ్లాలని ప్రయత్నించిన సిఐటియు జిల్లా కార్యదర్శి గనిశెట్టి సత్యనారాయణను పోలీసులు పట్టుకొని వెనక్కునెట్టారు.

ప్రజల దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం చూపాలని కోరిన కూటమి ప్రభుత్వానికి చెందిన ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మాటకు చంద్రబాబు విలువ ఇవ్వలేదు. కాలుష్య సమస్యతో తీవ్రంగా బాధపడుతున్న తాడి, స్వయంభూవరం గ్రామాలను తరలించాలని చేసిన ఆయన విజ్ఞాపనపై ఏ హామీ ఇవ్వలేదు.

కాలుష్య నియంత్రణకు శాశ్వత పరిష్కారం చూపుతామని ప్రజలకు భరోసా చూపలేదు. సామాన్యుల పట్ల, వారి సమస్యలను తీసుకొచ్చిన వారిపట్ల విముఖత భావం పోగొట్టుకోకుండా, మారామని చెప్పడం రాజకీయ నాటకీయత తప్ప నిజాయితీ అనిపించుకోదు

జివిఎంసి, విఎంఆర్‌డిఎ అభివృద్ధి పనులపై సమీక్ష

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ, విశాఖపట్నం మెట్రో రీజనల్ డెవలప్‌మెంట్ అథారిటీ అభివృద్ధి పనులపై రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పి.నారాయణ, విశాఖపట్నం ఇన్‌ఛార్జి మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు ఎం.శ్రీభరత్, శాసనమండలి సభ్యులు దువ్వారపు రామారావు, జివిఎంసి కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్, విఎంఆర్‌డిఎ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్, ఎపి టిడ్కో ఎమ్‌డి సునీల్ కుమార్, మెప్మా ఎమ్‌డి తేజ్ భరత్‌తో కలిసి విఎంఆర్‌డిఎ కార్యాలయంలో సమీక్షా సమావేశం శనివారం నిర్వహించారు. ముందుగా జివిఎంసి కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ జివిఎంసి అభివృద్ధి కార్యక్రమాల ప్రణాళికలను, పురోగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అన్న క్యాంటీన్ల నిర్వహణ, వందరోజుల చర్యల ప్రణాళిక, ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, ఆర్థిక ఆదాయం, పిపిపి ప్రాజెక్ట్ పనుల ప్రతిపాదనలు, పట్టణ ప్రణాళిక విభాగం విధులు, ఆదాయం, తదితర అంశాలపై వివరాలను రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణకు వివరించారు. జివిఎంసి పిపిటి వివరాలను గ్రహించిన మున్సిపల్ మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పున్ణ ప్రారంభించిన పేదల ఆకలి తీర్చే అన్నా క్యాంటీన్ల నిర్వహణలో ప్రజలకు ఇబ్బంది కలుగకుండా, నిర్వహణలో లోపం లేకుండా చర్యలు చేపట్టాలని, వందరోజుల చర్యల ప్రణాళికలో భాగంగా తాగునీటి సరఫరాలో గుర్తించిన గ్యాప్‌లను భర్తీ చేయాలని ఆదేశించారు. ప్రజలు వ్యక్తిగత నీటి కుళాయిలను తీసుకునేలా చర్యలు చేపట్టాలని అన్నారు.

ప్రగతి పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. నగరంలో దోమలను నిర్మూలించేందుకు డ్రోన్ స్ప్రేయింగ్ చేస్తూ గుర్తించిన 64 వాటర్ బాడీలను అందంగా తీర్చిదిద్దాలని, ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణలో వ్యర్థాల విభజన, సేకరణ, తరలింపు, నివాసితులు ద్వారా కంపోస్టు తయారీ ప్రక్రియ జరగాలని, ప్లాస్టిక్ వ్యర్థాలను వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట కు శతశాతం తరలించాలని ఆదేశించారు.

ఎయు థియేటర్ ఆర్ట్స్ బోర్డ్ ఆఫ్ స్టడీ మెంబర్‌గా దండు నాగేశ్వరరావు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రజా కళాకారునిగా రాష్ట్ర వ్యాప్త గుర్తింపు పొందిన నాటక రచయిత దండు నాగేశ్వరావును ఆంధ్ర విశ్వవిద్యాలయం థియేటర్ ఆర్ట్స్ విభాగంలో బోర్డ్ ఆఫ్ స్టడీ మెంబర్‌గా నియమిస్తూ ఆంధ్ర యూనివర్సిటీ ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ఆచార్య ఎస్.శశిభూషణరావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఈ పదవిలో మూడు సంవత్సరాల పాటు కొనసాగుతారు. నాటక రంగానికి నాగేశ్వరరావు చేస్తున్న కృషిని గుర్తిస్తూ ఆంధ్ర విశ్వ కళాపరిషత్ ఆయనను ఈ పదవికి ఎంపిక చేసింది. దండు నాగేశ్వరరావు సమాజాన్ని మేలుకొలిపే సందేశాత్మకమైన అనేక వీధి నాటకాలను రచించి గ్రామీణ ప్రాంతాల్లో ప్రదర్శించారు.

గతంలో ఆయన రచించిన చదువు వెలుగు వీధినాటికను విశాఖ జిల్లా వ్యాప్తంగా 30 రోజులపాటు ప్రదర్శించి విశేష ప్రజాదరణ పొందారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర టీవీ, నాటక రంగ అభివృద్ధి సంస్థ 2018వ సంవత్సరానికిగాను ఆయనకు కందుకూరి విశిష్ట పురస్కారాన్ని అందించింది. ఆయన గతంలో ఎయు థియేటర్ ఆర్ట్స్ విభాగంలో మెంబర్‌గా పని చేశారు. ఈ పదవికి ఆయన ఎన్నిక కావటం ఇది రెండోసారి.

ప్రకటన

మహారాజశ్రీ పిఠాపురం 12వ అదనపు జిల్లా కోర్టులో

M.V.O.P. 8/2023

బిట్వీన్:
కొట్టం శ్రీలక్ష్మి అండ్ అదర్స్ -పిటీషనర్లు
అండ్
దాసరి లోవరాజు అండ్ అదర్స్ -ప్రతివాదులు

R-1: దాసరి లోవరాజు, S/o. అప్పారావు, 43 సం॥లు, డ్రైవర్, డోర్ నెం. 1-1, మహాలబాని పాలెం, నక్కపల్లి, ప్రస్తుతం దేవవరం గ్రామం, నక్కపల్లి మండలం, విశాఖపట్నం జిల్లా.

పై నెంబర్ పిటిషన్‌లో మీరు నోటీసు అందుకోనందున శ్రీ కోర్టు వారు పేపర్ ద్వారా నోటీసు ఆర్డర్ వేసినారు. కావున మీ అభ్యంతరములు ది. 11-11-2024వ తేదీన ఉదయం 10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట మీరు గాని, మీ ప్లీడరు గాని హాజరు అయి మీ అభ్యంతరములు తెలియచేయవలెను. లేని యెడల మీకు వ్యతిరేకముగా తీర్పు చెప్పబడును.

బత్తిన లక్ష్మణదొర, అడ్వకేట్
పిఠాపురం, సెల్: 9848184474

IN THE HON'BLE COURT OF THE VI ADDL. SENIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
O.S.39/2024

Between:
Amit Sri Ram Gunnam,
Rep. by his GPA Holder
Sri Gunnam Jagga Rao
...Plaintiff

And:
Smt. Pothina Venkata Lakshmi
& 4 others ... Defendants

SUMMONS

To,
Defendant No.2:
M/s. R.K. Constructions,
Rep. by its Managing Partner:
Sri Yerramsetty Sivarama Krishna,
S/o. Subba Rao, Hindu,
aged 52 years, Office at
D.No.50-83-17, Madhuranagar,
Visakhapatnam-16.

Please take notice that the above suit is filed for recovery of money due under a registered mortgage deed dt 30-01-2012 executed by the 2nd defendant as Development Agreement cum General Power of Attorney holder of the 1st Defendant and the matter stands posted to **28-11-2024** for your appearance either in person or through an Advocate at **10:30 A.M.** failing which the matter will be heard and decided ex-parte in your absence by the Hon'ble Court.

(By Order of the Hon'ble Court)
S. ARUN DEV,
K. RAJA GOPALA RAO,
Advocates, Visakhapatnam.

ఆకాశవాణిలో పలు పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగంలో క్యాజువల్ న్యూస్ రీడర్ కమ్ ట్రాన్స్‌లేటర్, క్యాజువల్ బ్రాడ్‌కాస్ట్ అసిస్టెంట్‌గా పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగాధిపతి శ్రీసాయివెంపటి ఒక ప్రకటనలో తెలిపారు. క్యాజువల్ న్యూస్ రీడర్ కమ్ ట్రాన్స్‌లేటర్ నియామకానికి అభ్యర్థులు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీతోపాటు తెలుగు, ఆంగ్ల భాషల్లో ప్రావీణ్యం కలిగి ఉండాలని, ఆంగ్లం నుంచి తెలుగులో తర్జుమా చేయగల నైపుణ్యం, మంచి స్వరం కలిగి ఉండాలని స్పష్టం చేశారు. అలాగే రేడియో, టివి జర్నలిజంలో అనుభవం ఉండాలని, తెలుగు టైపింగ్‌తో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలని తెలిపారు. అలాగే క్యాజువల్ బ్రాడ్‌కాస్ట్ అసిస్టెంట్ నియామకానికి అభ్యర్థులు రేడియో ప్రొడక్షన్లో ఏదైనా డిగ్రీ లేదా డిప్లొమా అర్హత కలిగి ఉండాలని, తెలుగు, ఆంగ్లభాషల్లో ప్రావీణ్యం, కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలని తెలిపారు. ఆడియో రికార్డింగ్, ఎడిటింగ్‌లో అనుభవం ఉండాలని సూచించారు. అభ్యర్థులు 21 సంవత్సరాల నుంచి 50 సంవత్సరాల మధ్య వయసు కలిగి, విశాఖపట్నం ప్రాంతంలో నివసించే వారు అర్హులని అన్నారు. ఈ నియామకాలు శాశ్వత కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు కావని స్పష్టం చేశారు. ఆసక్తి కలిగిన జనరల్ క్యాటగిరి అభ్యర్థులు రూ.354 రూపాయలు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి అభ్యర్థులు రూ.266 రూపాయలు దరఖాస్తు రుసుమును అకౌంట్ నేమ్ : ప్రసారభారతి బిసిఐ ఎయిర్ విశాఖపట్నం, అకౌంట్ నెంబర్ 10428603125, ఐఎఫ్‌సిఐ కోడ్ : ఎస్‌బిఐఎన్000772, ఎస్‌బిఐ ఎయు క్యాంపస్ బ్రాంచ్ బ్యాంక్ అకౌంట్‌కు చెల్లించాలన్నారు. చెల్లించిన రసీదును దరఖాస్తుతో జతచేసి ఈనెల 5వ తేదీలోపు ది హెడ్ ఆఫీస్, ఆకాశవాణి, సిరిపురం, విశాఖపట్నం-53003 చిరునామాకు పంపించాలని కోరారు. దరఖాస్తు కవరు పైభాగంలో అప్లికేషన్ ఫర్ ఆర్‌ఎన్‌యు అని తప్పనిసరిగా రాయాలన్నారు. మరిన్ని వివరాలకు 9440674057 నెంబరును సంప్రదించాలని కోరారు.

విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలంలోని 5 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన 1100 మంది విద్యార్థులకు శనివారం అమనాం జెడ్‌పి హైస్కూల్‌లో ఉచిత నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరాన్ని ఎంపిపి దంతులూరి వెంకట శివ సూర్య నారాయణరాజు ప్రారంభించారు. ఎంఎస్‌ఆర్ కల్యాణ మండపం అధినేత మజ్జి కిషోర్ కుమార్ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో శంకర్ ఫౌండేషన్ జిఎం.రమేష్, ఎంపిటిసి చెల్లూరి నగేష్ బాబు, పొట్నూరు చంద్రశేఖర్, దాకమర్రి, మజ్జివలస, మజ్జిపేట, చిప్పాడ, అమనాం హైస్కూళ్ల విద్యార్థులు పాల్గొన్నారు.

'నకిలీ డాక్యుమెంట్లతో స్థల ఆక్రమణకు యత్నం'

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు పరిధి దారపాలెంలోని తన స్థలానికి కొందరు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి కబ్జాకు ప్రయత్నిస్తున్నారని శివాజీపాలెం ప్రాంతానికి చెందిన తోట చంద్రరావు ఆవేదన వ్యక్తంచేశారు. శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దారపాలెంలో సర్వే నెంబరు 15/2, 15/3లో సుమారు 800 గజాల స్థలాన్ని అడివరపు సన్యాసమ్మ, ఆమె కుమారులకు చెందిన భూమిని 1989లో తన తల్లి రామయ్యమ్మ పేరుమీద కొనుగోలు చేసామన్నారు. ఇటీవల ఆ స్థలాన్ని కొంత మంది వ్యక్తులు మోసపూరిత జిపిఎం సృష్టించి కబ్జాకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. దీనిపై కోర్టులో పోరాడుతున్నట్లు చెప్పారు. తనకు న్యాయం చేయాలని కోరారు.

ఎస్ఆర్.పురంలో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి-పెందుర్తి : మండలంలోని ఎస్ఆర్ పురంలో రూ.45 లక్షలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ అభివృద్ధి పనులను జనసేన నాయకులు దూది వెంకటరమణ, సోంబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి పనులకు ఇటీవల శంకుస్థాపన చేశామని తెలిపారు. రూ.45 లక్షలతో రోడ్లు, డ్రెయినేజీల పనులు చేపట్టామని, త్వరలోనే పూర్తి చేస్తామని చెప్పారు.

దేవాలయ భూముల క్రయవిక్రయదారులపై చర్యలు

ప్రజాశక్తి -మధురవాడ : కొమ్మాది గ్రామ శ్రీరాములు దేవాలయ భూముల క్రయ విక్రయాలకు ప్రయత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రెవిన్యూ అధికారులను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశించారు. కొమ్మాది గ్రామ సర్వే నెంబర్ 84 లోని 31సెంట్లు భూమికి స్థానిక సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో కాకుండా పెదగంట్యాడ సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించారని కొమ్మాదికి చెందిన పలువురు శనివారం ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. మొత్తం 1,500 గజాల రామాలయం స్థలాన్ని రెండు 750 గజాల సైట్లుగా విభజించి తప్పుడు రిజిస్ట్రేషన్‌కు పాల్పడ్డారని వివరించారు.

ఇళ్ల కూల్చివేతపై విచారణ జరపాలి

ఆర్‌డిఒ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఇళ్ల కూల్చివేతపై సమగ్ర విచారణ జరిపి, తమకు న్యాయం చేయాలని ఆనందపురం మండలం లొడగలవానిపాలెం బాధితులు, భూసాగు లబ్ధిదారుల కమిటీ సభ్యులతో కలిసి శనివారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా, నోటీసులు ఇవ్వకుండా ఏక పక్షంగా తమ ఇళ్లను రెవెన్యూ అధికారులు, సిబ్బందితో కలిసి కూల్చి వేసి నిరాశ్రయులను చేశారని వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో బాధితులు కె.పద్మ, కె.నరసింగరావు, పలువురు కమిటీ సభ్యులు ఉన్నారు.

పొగాకు అనర్థాలపై అవగాహన

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వక్తలు

ప్రజాశక్తి -తగరపువలస : పొగాకు వాడకం వల్ల కలిగే అనర్థాలపై భీమిలి మండలం చిప్పాడ జెడ్పీ హైస్కూల్‌లో శనివారం అవగాహన కల్పించారు. పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.మురళీకృష్ణ మాట్లాడుతూ, పొగాకు వాడకం వల్ల కేన్సర్, గుండె జబ్బులు వస్తాయని వివరించారు. పొగాకు వాడకం వల్ల ఏడాదికి ఏడు మిలియన్ల మంది చనిపోతున్నట్లు అనేక సర్వేలు చెబుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం రత్నం, ఉపాధ్యాయులు రేఖ అప్పారావు, రమేష్, ఎన్ఎస్ఎస్ పిఒ డాక్టర్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

మూడు క్రిమినల్ చట్టాలు ప్రమాదకరం

ప్రజాశక్తి-సీతమ్మధార : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు క్రిమినల్ చట్టాలు ఎంతో ప్రమాదకరమని హైదరాబాద్ సల్సార్ యూనివర్సిటీ ఆచార్యులు ప్రొఫెసర్ మురళి చెప్పారు. పౌర ప్రజా సంఘాల ఆధ్వర్యాన విశాఖలోని పౌర గ్రంథాలయంలో శనివారం ఆచార్య జివిఎన్.సాయిబాబా స్మృతి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా 'మూడు క్రిమినల్ చట్టాలు' అంశంపై ఆయన మాట్లాడుతూ, కొత్త చట్టాల ప్రకారం 40 నుంచి 60 రోజుల వరకు పోలీసులు ఎవరినైనా కస్టడీలో ఉంచుకోవచ్చన్నారు. కోర్టులో విచారణ జరపకుండానే జైల్లో ఉంచే అవకాశం ఇచ్చారని తెలిపారు. ఎస్పీలను స్పెషల్ జడ్జీలుగా నియమించే అవకాశాన్ని పొందుపరిచారని చెప్పారు. ఏదైనా కేసులో 90 రోజుల్లో బెయిల్ ఇచ్చే వారని, దాన్ని 150 రోజులకు పెంచారని తెలిపారు. 33 నేరాలకు శిక్షలు విపరీతంగా పెంచారని వివరించారు. 88 సాధారణ నేరాలకు జరిమానాలను రూ.10వేల నుంచి రూ.50 వేలకు పెంచారని, రూ.500 రూపాయలు జరిమానా కట్టలేని వారు కూడా జైల్లో ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. 14ఏళ్ల జీవిత శిక్షను 20 ఏళ్లకు పెంచారని, చిన్న నేరాలకు పెద్ద శిక్షలు నిర్దేశించారని వివరించారు. దేశంలో ఎక్కడి నుంచైనా జీరో ఎఫ్ఐఆర్‌ను నమోదు చేయవచ్చని తెలిపారు. జడ్జిలు, పీపీల కొరత ఉందని చెబుతున్నా పదేళ్లుగా వారి సంఖ్యను పెంచడం లేదన్నారు. 1997లో సాయిబాబాతో కలిసి ఓ కార్యక్రమంలో పనిచేసానని, తర్వాత ఢిల్లీలో కలిసేవారమని గుర్తు చేసుకున్నారు. అధికారంలో ఉండే వారు నియంతలా వ్యవహరిస్తే, వారి నుంచి కాపాడేందుకు రాజ్యాంగాన్ని అనుసరించే వారికి నిర్బంధం తప్పదన్నారు. సాయిబాబా విడుదల కోసం చట్ట ప్రకారంగా పోరాటం చేసిన ఇద్దరు ప్రొఫెసర్లు జైల్లో ఉన్నారని గుర్తు చేశారు.

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, 90 శాతం అంగవైకల్యం కలిగిన ప్రొఫెసర్ సాయిబాబా పట్ల కోర్టులు వ్యవహరించిన తీరు దారుణమని విమర్శించారు. భక్తి ముసుగులో మహిళలపై అత్యాచారాలకు, హత్యలకు పాల్పడిన డేరా బాబాకు కోర్టులు 17 సార్లు పెరోల్ ఇచ్చాయని, తల్లి మరణించినప్పుడు కూడా సాయిబాబాకు పెరోల్ నిరాకరించాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు చిలకా చంద్రశేఖర్, విరసం నేత కృష్ణ, సిఐఎంఎస్ లలిత, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం లక్ష్మి, భారత నాస్తిక సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు టి.శ్రీరామూర్తి, రైతు సంఘం నాయకుడు డాక్టరు కొల్లా రాజమోహన్, న్యాయవాది కెఎస్.చలం, మహిళా న్యాయవాది పద్మ, ఐఎఫ్‌టియు నాయకుడు వెంకటేశ్వర్లు తదితరులు ప్రసంగించారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఐటి ఉద్యోగి మృతి

క్రాంతికుమార్ (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి -మధురవాడ : పిఎంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐటి ఉద్యోగి మృతి చెందినట్లు సిఐ జి.బాలకృష్ణ తెలిపారు. సిఐ కథనం ప్రకారం... శ్రీకాకుళం జిల్లా కొత్తూరుకు చెందిన ఎం.క్రాంతికుమార్ (21) మధురవాడ నగరంపాలెం రోడ్డులో తన తల్లితో కలిసి నివాసం ఉంటున్నాడు. మధురవాడ ఐటి హిల్స్‌లోని టెక్ మహేంద్రలో విధులు నిర్వహిస్తున్నాడు. క్రాంతికుమార్ శుక్రవారం రాత్రి విధులు ముగించుకుని ఇంటికి వస్తు మార్గ మధ్యలో ఐటి హిల్స్ బీచ్ రోడ్డు వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి ప్రమాదానికి గురైంది. కిందపడిన క్రాంతికుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆ సమయంలో అటుగా వెళ్తున్న వారు గుర్తించి అతనిని చికిత్స నిమిత్తం స్థానిక గీతం ఆసుపత్రికి తరలించారు. పోలీసులకు సమాచారం అందించారు. క్రాంతి కుమార్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పిఎం.పాలెం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. మృతుని తల్లి ఎం.రామప్రభ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సిఐ తెలిపారు.

జగ్జీవన్‌రామ్‌కాలనీలో అగ్ని ప్రమాదం

దగ్ధమైన ఇంట్లో సామాన్లు

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 76వ వార్డు పరిధి బాబూ జగ్జీవన్‌రామ్‌కాలనీలోని ఓ ఇంట్లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఇంటి యజమాని దొర భార్య హేమ వంట చేస్తుండగా ఒక్క సారిగా మంటలు చెలరేగాయి. దీంతో ఆమె ఒక్కసారిగా బయటకు పరుగులు తీశారు. బయటకు వచ్చిన క్షణాలలోనే విద్యుత్ తీగలు వల్ల ఇల్లు మొత్తం దగ్ధమైంది. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలు అదుపు చేశారు. సుమారు రూ.10 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని ఇంటి యజమాని దొర చెబుతున్నారు. స్థానిక తహసీల్దార్‌కు సమాచారం అందజేశారు.

యువకుడు దుర్మరణం - మరొకరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి -అచ్యుతాపురం : అచ్యుతాపురం విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మేరుగు మహాలక్ష్మి అనే యువకుడు మృతి చెందగా, ఆయన స్నేహితుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... మండలంలోని పూడిమడక శివారు కడపాలెం గ్రామానికి చెందిన మేరుగు మహాలక్ష్మి, తన స్నేహితునితో కలిసి శనివారం సాయంత్రం అచ్యుతాపురం నుంచి పూడిమడక వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. అచ్యుతాపురం విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో వారికి గేదెలు అడ్డంగా రావడంతో వాటిని తప్పించబోయి, అటుగా వస్తున్న లారీని ఢీకొట్టారు. దీంతో మహాలక్ష్మి తలకు తీవ్ర గాయమై అధిక రక్తస్రావం జరిగి సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. ఆయన స్నేహితుడు తీవ్రంగా గాయపడడంతో ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆయన పరిస్థితి విషమంగా ఉంది. మహాలక్ష్మి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ హాస్పిటల్‌కి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కశింకోట : కశింకోట మండలం నరసింగబిల్లి జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు. మృతుని వివరాలు తెలియరాలేదని, ఆయన వివరాలు తెలిసిన వారు 9440796088 ఫోన్ నెంబరుకు తెలియజేయాలని సిఐ స్వామి నాయుడు కోరారు.

ప్రొఫెసర్ సాయిబాబా మరణం తీరని లోటు

ప్రజాశక్తి-లీగల్ : ఢిల్లీ ప్రొఫెసర్ సాయిబాబా మరణం మానవ హక్కుల పరిరక్షణలో తీరని లోటు అని, దానిని ఎవరూ పూడ్చలేనిదని ఆంధ్ర యూనివర్సిటీ జర్నలిజం విభాగం మాజీ హెడ్ ప్రొఫెసర్ బాబి వర్ధన్ అన్నారు. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) విశాఖపట్నం కమిటీ ఆధ్వర్యాన కీర్తిశేషులు ప్రొఫెసర్ ఢిల్లీ సాయిబాబా సంస్మరణ సభను అల్లూరి విజ్ఞానకేంద్రంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బాబీవర్ధన్ హాజరై ప్రసంగించారు. నేటి ప్రసార మాధ్యమాలు అదాని, అంబానీ లాంటి కార్పొరేట్ కంపెనీల చేతుల్లో నడుస్తున్నాయన్నారు. దీని వల్ల సాయిబాబా లాంటి ప్రజా ఉద్యమాలకు నిలయమైన వ్యక్తులకు జరిగే నష్టాలను ప్రజలకు, తెలియజేయటంలో విఫలమవుతున్నాయని పేర్కొన్నారు. ప్రొఫెసర్ సాయిబాబా అరెస్టులో ప్రభుత్వ కక్ష సాధింపు, న్యాయవ్యవస్థ విఫలమయ్యే పరిస్థితులు స్పష్టమయ్యాయని తెలిపారు. మరో విశిష్ట అతిథి, న్యాయవాద సంఘం పూర్వ అధ్యక్షులు వైద్యుల రవీంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, సాయిబాబాను జైల్లో ప్రత్యేకమైన చీకటి గదిలో ఉంచి ఆయనకు అందవలసిన ఖైదీ హక్కులను కూడా ఇవ్వకుండా హరింప చేయడంలో రాజ్య హింస ప్రస్ఫుటమయిందని చెప్పారు సీనియర్ న్యాయవాది వివి బాలకృష్ణ మాట్లాడుతూ, ప్రజా పీడిత, సామాన్య ప్రజల హక్కులను కాపాడడంలో సాయిబాబా పాత్ర వేగుచుక్క లాంటిదని కొనియాడారు. సభాధ్యక్షులు, ఐలు విశాఖ యూనిట్ అధ్యక్షులు అల్లు సురేష్ మాట్లాడుతూ, 90 శాతం అంగవైకల్యం కలిగిన సాయిబాబాపై రాజ్యం దాడి వల్ల జైల్లో పూర్తిగా వైద్యమందక ఆయన అంతర్గత అవయవాలు పాడైపోయాయని, దాన్ని పర్యవసానంగా మరణం సంభవించిందని వాపోయారు. ఇది ఒక రకంగా హక్కుల పరిరక్షణ కార్యకర్తకు ప్రభుత్వం ఇచ్చిన బహుమతులాంటిదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఐలు విశాఖ యూనిట్ జనరల్ సెక్రటరీ ఎన్.వెంకటేశ్వరరావు ఉపాధ్యక్షులు చాట ఆనందరెడ్డి, కెవై.మణి, కోశాధికారి అప్పలరెడ్డి, పెద్ద ఎత్తున సీనియర్, జూనియర్ న్యాయవాదులు, హక్కుల కార్యకర్తలు పాల్గొన్నారు.

సంస్మరణ సభలో వక్తలు

సభలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ బాబీవర్ధన్

లబ్ధిదారులకు దీపం పథకం సిలిండర్లను అందజేస్తున్న ఎమ్మెల్యే గణబాబు

దీపం-2 సిలిండర్ల పంపిణీ

ప్రజాశక్తి -యంత్రాంగం

ములగాడ : జివిఎంసి 61వ వార్డు పరిధి ప్రకాష్‌నగర్‌లో దీపం-2 పథకాన్ని ఎమ్మెల్యే గణబాబు శనివారం ప్రారంభించారు. మహిళలకు గ్యాస్ సిలిండర్లను అందించారు. ఈ కార్యక్రమంలో అంగ దుర్గా ప్రశాంతి, గల్లా చిన్న, ఆరేటి మంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : జివిఎంసి 20వ వార్డు శివాజీపాలెం రఘురాం గ్యాస్ ఏజెన్సీలో దీపం - 2 పథకాన్ని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు మహిళా సాధికారత లక్ష్యంగా దీపం - 2 పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో రఘురాం గ్యాస్ ఏజెన్సీ అధినేత జెఎల్ఎన్.కుమార్, టిడిపి సీనియర్ నాయకులు బైరెడ్డి పోతన్న రెడ్డి, బొట్టా వెంకట రమణ, కాళ్ల శంకర్, ఎఎస్ఒ కల్యాణి, గ్యాస్ ఏజెన్సీ మేనేజర్ మోహన్ పాల్గొన్నారు.

మళ్ల సత్యాన్ని పరామర్శిస్తున్న జియ్యాని శ్రీధర్

మళ్లకు జియ్యాని పరామర్శ

ప్రజాశక్తి-వేపగుంట : విశాఖ పశ్చిమ నియోజకవర్గం కొత్తపాలెం ప్రాంతంలో నివాసముంటున్న ప్రముఖ పారిశ్రామికవేత్త మళ్ల సత్యం అనారోగ్యంతో బాధపడుతుండటంతో శనివారం జివిఎంసి డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పరామర్శించారు. మళ్ల సత్యంతో మాట్లాడి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

శివశంకర్‌ను సత్కరిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

అభివృద్ధి దిశగా రాష్ట్రం : నాదెండ్ల

ప్రజాశక్తి-సీతమ్మధార : ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆధ్వర్యాన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి దిశగా పయనిస్తోందని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. సీతంపేట జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన కార్యకర్తల నుద్దేశించి మాట్లాడారు. ఎన్నికల హామీల్లో ఇచ్చిన వాగ్దానాలు ఒకొక్కటి నెరవేర్చుతున్నట్లు తెలిపారు. జనసేన పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషిచేయాలన్నారు. లబ్ధిదారులకు పథకాలు అందేలా చూడాలని చెప్పారు. అనంతరం ఎంఎస్ఎంఇ చైర్మన్ శివశంకర్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నగర అధ్యక్షులు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌యాదవ్, నాయకులు పసుపులేటి ఉషాకిరణ్, బొడ్డేపల్లి రఘు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ కార్మికులకు జీతాలు చెల్లించాలి

ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న అయోధ్యరామ్

ప్రజాశక్తి - ఉక్కునగరం : విశాఖ ఉక్కు కార్మికులకు తక్షణమే జీతాలను చెల్లించాలని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ ఉక్కు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్‌లోని సిఎంఎస్ పాయింట్ వద్ద ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. విశాఖ స్టీల్ యాజమాన్యం, కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం కావాలనే విశాఖ స్టీల్ ప్లాంట్‌ను నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. కాపాడతామని పేరుతో ప్యాకేజీలు ఇస్తున్నామని ప్రచారం చేస్తూ స్టీల్‌ప్లాంట్‌ను బలహీనపరిచేందుకు కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. ఎన్‌డిఎ ప్రభుత్వం తక్షణమే స్పందించి స్టీల్ ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడిపించి లాభాల బాటను పట్టించాలని డిమాండ్ చేశారు. పూర్తిగా రా మెటీరియల్ అందజేయాలని, సొంత గనులను కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సంక్షేమానికి కోతలను విధించడం, సమయానికి జీతం చెల్లించకపోవడం దారుణమన్నారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ చరిత్రలో జీతాలను ఇవ్వలేని ఘటన ఎన్నడూ జరగలేదని, కావాలనే ఉక్కు యాజమాన్యం, కేంద్ర ప్రభుత్వం కార్మికులకు జీతాలు ఇవ్వకుండా వేధింపులకు గురి చేస్తుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉద్యోగులను వికెఆర్ఎస్ పేరుతో భయభ్రాంతులకు గురి చేయడం తగదన్నారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు వైటి.దాస్, రామస్వామి, టివికె.రాజు, శ్రీనివాసరాజు, మరిడియ్య, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రదర్శన వివాదంపై నివేదిక ఇవ్వండి'

ప్రజాశక్తి -కరాస: జివిఎంసి 52వ వార్డు పరిధి మర్రిపాలెం ఉడా లే-అవుట్‌లోని స్టెల్లా మేరీస్ స్కూల్ యాజమాన్యం గత నెల 30వ తేదీన 'దీపావళి బాణసంచాతో ఇబ్బందులు' పేరుతో జాతీయ రహదారిపై ప్రదర్శన చేయడంపై ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాలో వస్తున్న వార్తలపై విశాఖ జిల్లా విద్యాశాఖాధికారులు తక్షణ నివేదిక అందించాలని ఆదేశాలు జారీ చేసినట్టు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం తెలిపారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. జాతీయ రహదారిపై విద్యార్థులతో ప్రదర్శన చేపట్టే ముందు స్కూల్ యాజమాన్యం, పోలీసులు, విద్యాశాఖాధికారుల నుంచి అనుమతులు తీసుకున్నారా, లేదా, విద్యార్థుల మనోభావాలు దెబ్బతిన్న అంశాలు ప్రస్ఫుటం అయ్యాయా, తదితర అంశాలపై విద్యార్థుల వ్యక్తిగత అభిప్రాయాలు సేకరించి నివేదికను అందించాలని ఆదేశాలు జారీచేసినట్టు పేర్కొన్నారు. నివేదిక ఆధారంగా తదుపరి చర్యలకు రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసులు చేయనున్నట్టు సీతారాం తెలిపారు.

తాగునీరు పరిశుభ్రంగా ఉండాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : మనం తాగే నీరు పరిశుభ్రంగా ఉండాలని, శుద్ధి చేసిన నీరు తాగడం వల్ల వ్యాధులకు దూరంగా ఉంటామని అయాన్ ఎక్చేంజ్ (ఇండియా) సంస్థ కంట్రీ హెడ్ రవికాంత్ తెలిపారు. విశాఖలోని ఓ హోటల్‌లో 'హైడ్రోజన్ వాటర్' పేరిట ఆయన సంస్థ అనుభవజ్ఞులతో అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. విశాఖకు చెందిన కొప్పిశెట్టి మురళీకృష్ణ అధ్యక్షతన హైడ్రోజన్ వాటర్‌పై నిపుణులతో పాటు అనేక పరిశోధనలు చేసిన వైద్యులు, అనుభవజ్ఞులచే యువత, వినియోగదారులకు అవగాహన కల్పించారు. మనిషి ఆరోగ్యకరమైన జీవన గమనానికి తాగునీటిలో ఉండే యాక్టివ్ హైడ్రోజన్ ఎంతగానో దోహదం చేస్తుందని ఆరోగ్య నిపుణులు వివరించారు. ఈ హైడ్రోజన్ వాటర్ టెక్నాలజీని భారతదేశంలో తొలి సారిగా అయాన్ సంస్థే పరిచయం చేసిందని ఆ కంపెనీ వర్గాలు వెల్లడించాయి. 'మంచినీరు-ఆరోగ్యం' అనే కార్యక్రమంపైనా వైద్య నిపుణులు తమ అభిప్రాయాల్ని వెల్లడించారు. సర్టిఫైడ్ హైడ్రోజన్ అడ్వయిజర్ శ్రీనివాసులు అప్పల, డాక్టర్ అప్పారావు (ఇమ్యూనాలజిస్టు), డాక్టర్ జయకుమార్ (పిడియాట్రీషియన్), రొటేరియన్ రాథోడ్, భిమల్ (సేల్స్ హెడ్) తదితరులు పాల్గొన్నారు.

జూ పార్కులో పేలుడు పదార్థాలు నిషేధం

ప్రజాశక్తి - ఆరిలోవ : నాగుల చవితిని పురస్కరించుకొని ఈ నెల 5న జూ పార్కుకు వచ్చిన సందర్శకులు పేలుడు పదార్థాలు, మందు గుండు సామగ్రిని తీసుకొని లోనికి రాకూడదని జూ క్యూరేటర్ మంగమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగుల చవితిని పురస్కరించుకొని మంగళవారం సందర్శకుల కోసం సాధారణ పనివేళలు కంటే ముందుగానే ప్రవేశం కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 7.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తెరిచి ఉంటుందని తెలిపారు.

వైఎస్ఆర్‌టియుసి నేత మస్తానప్ప మృతి

ప్రజాశక్తి -ఉక్కునగరం : స్టీల్ వైఎస్ఆర్‌టియుసి ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్ప శనివారం ఉదయం అనారోగ్యంతో మృతిచెందారు. ఉక్కునగరంలోని వైఎస్ఆర్‌టియుసి కార్యాలయం వద్ద సంతాప సభను ఏర్పాటు చేశారు. మస్తానప్ప భౌతికకాయాన్ని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ సిహెచ్.నర్సింగరావు సందర్శించి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన పోరాటం కీలకంగా జరుగుతున్న సమయంలో సీనియర్ నాయకుడిని కోల్పోవడం అత్యంత బాధాకరమని అన్నారు. మస్తానప్ప కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

కడప ప్రాంతానికి చెందిన మస్తానప్ప ఉద్యోగ విరమణ పొందారు. ప్రస్తుతం ఉక్కునగరంలో నివాసముంటున్నారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగం చేస్తూ వైఎస్ఆర్‌టియుసి, వైసిపి పార్టీ బలోపేతానికి కృషి చేశారు. కార్మికులకు శాఖా పరమైన ఇబ్బందులు తలెత్తితే అధికారులతో మాట్లాడి పరిష్కరించేవారు. మంచి వ్యక్తి మృతి అత్యంత బాధాకరమని కార్మిక నేతలు ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు ఎన్.రామారావు, స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరాం, ఐఎన్‌టియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్, వివిధ విభాగాల నుంచి సీనియర్ ఉద్యోగులు, అధికారులు పాల్గొన్నారు.

మస్తానప్ప భౌతికకాయానికి పూలమాల వేస్తున్న సిహెచ్.నర్సింగరావు, జగ్గునాయుడు

సమస్యలపై చంద్రబాబుకు వినతులు

ప్రజాశక్తి-పరవాడ

పరవాడ సినిమా హాల్ జంక్షన్ వద్ద రోడ్లకు గుంతలు పూడ్చేందుకు భూమి పూజ కార్యక్రమానికి శనివారం విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు పలు సమస్యలపై వినతిపత్రాలు అందించారు.

భూ కుంభకోణాలపై చర్యలు తీసుకోవాలి

విశాఖపట్నం చుట్టుపక్కల 11 మండలాల్లో గతంలో జరిగిన ప్రభుత్వ భూముల కుంభకోణాలకు సంబంధించిన బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలని, సంబంధిత ప్రభుత్వ భూములను వెనక్కి తీసుకొని వాటిని రక్షించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, గొర్లివానిపాలేనికి చెందిన ఆర్‌టిఐ కార్యకర్త చిప్పాడ రామారావు వినతి పత్రం సమర్పించారు. ఈ కుంభకోణాలపై సిట్ 2017లో టిడిపి ప్రభుత్వం, 2019లో వైసిపి ప్రభుత్వం సిట్‌లు వేశాయని, రెండు సిట్‌ల అధికారులు ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చాయని గుర్తు చేశారు. అయితే ఈ విచారణ నివేదికలు కావాలని ఆర్టిఐ ద్వారా విశాఖపట్నం జిల్లా ఉన్నతాధికారులకు దరఖాస్తు చేయగా, జీవో నెంబర్లతో సమాచారం ఇచ్చి చేతులు దులుపుకున్నారని, విచారణ పూర్తి నివేదికలు తమ కార్యాలయంలో లభ్యంగా లేవని సమాధానం ఇచ్చారని పేర్కొన్నారు. భూముల రీ సర్వేలో జరిగిన తప్పిదాలను సరిచేసి రైతులకు న్యాయం చేయాలని, నీటి ప్రవాహ భూములు, చెరువులు, కొండలు, వాగు భూముల పరిరక్షణకు తగు చర్యలు తీసుకోవాలని ఆ వినతి

ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతిపత్రం ఇస్తున్న చింతకాయల ముత్యాలు

పత్రంలో కోరారు.

ఫార్మా కాలుష్యాన్ని అరికట్టాలి..

మండలంలోని రాంకీ ఫార్మా సిటీ కాలుష్యం అరికట్టాలని, తాడి, మూల స్వయంవరం, సోమనాయుడుపాలెం గ్రామాలను తరలించాలని, ఫార్మా ఎన్‌టిపిసి నిర్వాసితులకు 75 శాతం ఉపాధి కల్పించాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలని, ఫార్మా పరిశ్రమల ప్రమాదాలు అరికట్టాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ వినతిపత్రం అందజేశారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఆంక్షలు లేవంటూనే వినతిపత్రం ఇవ్వడానికి వచ్చిన సిఐటియు నేత గనిశెట్టి సత్యనారాయణను ముందు పోలీసులు అడ్డగించారు. అలాగే ఎస్ఇజెడ్ అభిజిత్ కార్మికులను బారికేడ్లు పెట్టి అడ్డగించారు. 21 రోజులుగా వేతనాలు లేక ఆకలితో అలమటిస్తున్న అభిజిత్ కార్మికులు వినతిపత్రం ఇవ్వకుండా చేశారని గనిశెట్టి ఆవేదన వ్యక్తం చేశారు.

మత్స్యకారులకు ఉద్యోగాలు కల్పించాలి..

ఎన్‌టిపిసి, ఫార్మసిటీ కంపెనీల్లో మత్స్యకారులకు ఉద్యోగాలు కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాష్ట్ర మత్స్యకార నాయకులు, ముత్యాలమ్మపాలెం సర్పంచ్ చింతకాయల సూజాత ముత్యాలు వినతిపత్రం అందజేశారు. ఫార్మాసిటీ వ్యర్థ రసాయనాల వల్ల మత్స్యసంపద క్రమేపి తగ్గిపోతూ మత్స్యకారులు ఉపాధి కోల్పోయారని తెలిపారు. ఫార్మాసిటీలో మత్స్యకారులకు ఉపాధి కల్పించాలని 2012లో చేపట్టిన పోరాటం సందర్భంగా 500మందికి ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీ నేటికీ అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

చంద్రబాబును కలిసిన నేతలు

బుచ్చయ్యపేట, అచ్యుతాపురం : ముఖ్యమంత్రి చంద్రబాబును రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్, టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు, ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, టిడిపి ఎలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జి ప్రగడ నాగేశ్వరరావు తదితరులు వేర్వేరుగా కలిశారు. ఈ సందర్భంగా వారు పుష్ప గుచ్చాలు ఇచ్చారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-సబ్బవరం

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల విద్యాలయ సంస్థ వారు నిర్వహించిన ఫ్యూచర్ అన్-2024, సైన్స్ ఎగ్జిబిషన్ పోటీలలో స్థానిక గురుకుల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. జిల్లా స్థాయిలో సైన్స్, ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్ టెక్నాలజీ, సోషల్ సైన్స్, క్రాఫ్ట్ నాలుగు విభాగాల్లోనూ విజయం సాధించినట్లు ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ తెలిపారు. మూడు విభాగాలలో ప్రథమ స్థానాన్ని సాధించిన అశోక్, విశ్వనాథ్, శివహేమంత్, నవదీప్, మున్నను సైన్స్, ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్ టెక్నాలజీలలో గైడ్ చేసిన టీచర్ డాక్టర్ టి రాంబాబును క్రాఫ్ట్ విభాగంలో గైడ్ చేసిన డి.నానాజీని, ప్రిన్సిపాల్ యస్ రామక్రిష్ణను విశాఖ జిల్లా కలెక్టర్ హరేందిరప్రసాద్, జాయింట్ సెక్రటరీ మురళీకృష్ణ, డీసీఓ యస్.రూపవతి ప్రశంసించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 18న ఆర్‌కె పురం గురుకుల పాఠశాలలో జరిగే స్టేట్ లెవెల్ పోటీలలో పాల్గొంటున్నట్లు తెలిపారు. గెలుపొందిన విద్యార్థులను వైస్ ప్రిన్సిపాల్ సత్యారావు, ఉపాధ్యాయులు మోహనరావు, జానకి రామ్, హెచ్.సింహాచలం, చిరంజీవిరావు, ప్రభాకరరావు, తిరుపతిరావు, పిడి ప్రసాద్, పిఈటి సూర్యనారాయణ శనివారం అభినందించారు.

పశుగర్భకోశ చికిత్స శిబిరం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని మొగలిపురం గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సౌజన్యంతో శనివారం ఉచిత పశు గర్భకోశ చికిత్స శిబిరం, పాడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ శిబిరాన్ని టీడీపీ పెందుర్తి నియోజకవర్గం ఇంచార్జి గండి బాబ్జి ప్రారంభించారు. 52 పశువులకు గర్భకోశ చికిత్స చేసి,పేడ, బ్లడ్ శాంపిల్ తీసి పరీక్షలు చేశారు. 32 పెయ్యలకు నట్టల నివారణ మందులు వేశారు. కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వాహణాధికారి డాక్టర్ బి.ప్రసాదరావు, ఉప సంచాలకులు డాక్టర్ ఎం.చంద్రశేఖర్, సబ్బవరం సహాయ సంచాలకులు డాక్టర్ కె.ఉష కుమారి, డాక్టర్ పి.భానుబాబు, జిల్లా డిఎల్‌డిఏ డాక్టర్ ఎస్.సౌజన్య, ఎస్.స్వర్ణలత, జి.అరుణ, గుల్లేపల్లి పశు వైద్య అధికారి డాక్టర్ బి.సంధ్య, ఎంపిటిసి తమరాన బంగారు నాయుడు, వార్డు సభ్యులు అంగటి నానాజీ, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో పల్లె పండుగలో భాగంగా రూ.4 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ సరగడము భాగ్యలక్ష్మి బాబు నాయుడు ఆధ్వర్యంలో శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వానికి ఎలమంచిలి ఎమ్మెల్యేకు సర్పంచ్ నాయకులు ధన్యవాదాలు తెలిపారు.

బిఎస్ఎన్.మూర్తి సేవలు మరువలేనివి

ప్రజాశక్తి-సబ్బవరం : స్థానిక ఎంఈఓ-2 బిఎస్ఎన్ మూర్తి సేవలు మరువలేనివని ఎంపిపి బోకం సూర్యకుమారి రామునాయుడు అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన ఎంఈఓ పదవీ విరమణ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఎంఈఓ మూర్తి ఎంతోమంది విద్యార్థులను విద్యా వంతులుగా తీర్చిదిద్దారన్నారు. మాజీ ఎంఎల్‌సి గాదె శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ మూర్తి తనదైన శైలిలో ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగి విద్యార్థుల జీవితాల్లో వెలుగులను నింపారన్నారు. అనంతరం మూర్తిని ఎంపిపి సూర్యకుమారి రామునాయుడు, మాజీ ఎంఎల్‌సి శ్రీనివాసులు నాయుడు, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పూల గుచ్ఛాలను అందజేసి దుస్సాలువతో సత్కరించారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైసిపి నేత భరత్‌కుమార్ తదితరులు

నాగదుర్గమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి ఎన్టీఆర్ మార్కెట్లో శ్రీనాగ దుర్గమ్మ జాతరకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను స్థానిక రింగ్ రోడ్‌లోని వైసీపీ కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. నాగులచవితి ఉత్సవాల్లో భాగంగా అనకాపల్లి రింగ్ రోడ్డు ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో శ్రీనాగ దుర్గమ్మ జాతర మహోత్సవం, అనకాపల్లి గవరపాలెం దిబ్బవీధి శ్రీనాగేంద్రస్వామి దేవస్థానం ఉత్సవ కరపత్రాన్ని వైసిపి నియోజకవర్గం సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆయా దేవస్థానంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు అభినందించారు.

శ్రమదానంతో వాటర్ ట్యాంక్ శుభ్రం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : స్థానిక శాఖ గ్రంథాలయంలో వాటర్ ట్యాంక్‌ను శనివారం పాఠకులు, విద్యార్థులు శ్రమదానంతో శుభ్రపరిచారు. గ్రంథాలయాధికారి దొడ్డి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ట్యాంక్ పరిశుభ్రతతో పాటు గ్రంథాలయ ఆవరణంలో పరిశుభ్రత కార్యక్రమాలను చేశారు.

నూతన కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే అభినందనలు

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం స్వయంభు గౌరీశ్వరస్వామి ఆలయ పాలకమండలి నూతన కమిటీ సభ్యులను స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు శనివారం అభినందించారు. కమిటీ ఛైర్మన్‌గా గూనూరు సురేష్, కమిటీ సభ్యులుగా మరో 34 మందిని నియమించారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు గూనూరు మల్లు నాయుడు, మాజీ ఎంపిపి వెంకట సత్యనారాయణ, మాజీ జడ్పిటిసి కనిశెట్టి సన్యాసిరావు, గూనూరు పెద్ద అచ్చిబాబు, ఎంపిటిసి నాయుడు, అర్చకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టీ షర్టుల వితరణ

ప్రజాశక్తి-మునగపాక : స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు గ్రామానికి చెందిన పాల్ జి ట్రిక్స్ అధినేత ఆడారి అప్పలనాయుడు శనివారం టీ షర్టులను అందజేశారు. ఇటీవల మండల, నియోజకవర్గ, జిల్లా, స్థాయి పోటీలలో పలు క్రీడలలో పాల్గొని విజేతలుగా నిలబడమే కాకుండా రాష్ట్రస్థాయి పోటీలకు కూడా ఎంపిక కావడం పట్ల హర్షం వెలిబుచ్చుతూ వారికి తన సొంత నిధులతో సమకూర్చిన "జిల్లా పరిషత్ హై స్కూల్ మునగపాక" సింబల్ గల టీ షర్టులను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసరావు, కమిటీ ఛైర్మన్ ఆడారి సూర్యచంద్ర రామారావు, శ్రీకాంత్, పాల్గొన్నారు.

ఆవు పాలు సేకరణ ధర వెంటనే పెంచాలి

ఏపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ

మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సూర్యనారాయణ

ప్రజాశక్తి-అనకాపల్లి

విశాఖ డెయిరీ తగ్గించిన ఆవుపాలు ధరను తక్షణమే పెంచాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. అనకాపల్లి దొడ్డి రాము నాయుడు భవనంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాల్లో విశాఖ డెయిరీకి 3.50 లక్షల మంది రైతులు రోజూ పాలు పోస్తున్నారని తెలిపారు. ఇప్పటికే పాలు రైతులకు పశు పోషణ, వైద్యం, కృత్రిమ గర్భాధారణ వంటి ఖర్చులు పెద్ద ఎత్తున పెరిగాయని పేర్కొన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా పాల సేకరణ ధర పెంచాల్సిన డెయిరీ యాజమాన్యం అక్టోబర్ 16 నుంచి లీటరుకు రూ.3 నుండి రూ.4 వరకు తగ్గించడం అన్యాయమన్నారు. దీని వల్ల రైతులు రోజుకు రూ.20 లక్షలు, ఏడాదికి రూ.68 కోట్లు రైతులు తమ కష్టార్జితాన్ని కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాల సేకరణ ధరకు, పాలు అమ్మకం ధరకు లీటర్ దగ్గర రూ.23 వ్యత్యాసం ఉందని, అందులో ప్రాసెసింగ్ ధర రూ.10 పోయినా లీటర్‌కి రూ.13 డెయిరీకి మిగులుతుందని, ఇందులో రూ.10 పాడి రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లాభాల్లో ఉన్న విశాఖ డెయిరీని యాజమాన్యం నష్టాలు చూపిస్తుందని, డెయిరీలో పెద్దఎత్తిన అవినీతి అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయని పేర్కొన్నారు. దీనిపై వెంటనే రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి జోక్యం చేసుకొని డెయిరీ యాజమాన్యం తగ్గించిన ఆవు పాల సేకరణ ధర పెంచాలని, అవినీతి ఆరోపణలపై సమగ్రమైన విచారణ జరిపించాలని, తప్పు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ, కర్ణాటకలో కో-ఆపరేటివ్ డెయిరీలుకు పాలు పోస్తున్న రైతులకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు అదనంగా రూ.5 ఇస్తున్నాయని, ఏపి ప్రభుత్వం అదే మాదిరిగా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, ప్రధాన కార్యదర్శి ఎం అప్పలరాజు, జిల్లా కోశాధికారి గండి నాయన బాబు పాల్గొన్నారు.

అభిజిత్ లే ఆఫ్‌పై ముఖ్యమంత్రి దృష్టి సారించాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం

అభిజిత్ పరిశ్రమ లే ఆఫ్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టి సాధించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము డిమాండ్ చేశారు. అభిదిజ్ పరిశ్రమ ప్రధాన గేటు వద్ద కార్మికులు శనివారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ అభిజిత్ పరిశ్రమ మూతపడి 21 రోజులు గడుస్తున్నా యాజమాన్యంలో ఎటువంటి మార్పులు కనబడలేదని, ప్రభుత్వం పట్టించుకోలేదని పేర్కొన్నారు. పరిశ్రమ తెరిపించి 1000 మంది కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. ముఖ్యమంత్రిని కలవడానికి ముందు అనుమతి తెలిపి తర్వాత నిరాకరించడం దారుణమన్నారు. కార్మికులకు బకాయిపడిన వేతనాలు, బోనస్సు వెంటనే చెల్లించాలని కోరారు.

ఆందోళన చేస్తున్న అభిజిత్ కార్మికులు

రాష్ట్రస్థాయి పోటీలకు వేచలం విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని వేచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అక్టోబర్ 30న ఆంధ్రా యూనివర్సిటీ మెడికల్ గ్రౌండ్సులో జరిగిన ఉమ్మడి విశాఖ జిల్లా ఎస్‌జిఎఫ్ అథ్లెటిక్స్ ఈవెంట్లలో అండర్ - 17 బాలికల విభాగంలో బి. చైతన్య (9వ తరగతి) ట్రిపుల్ జంప్, లాంగ్ జంప్‌లోనూ, జి.సుధ (10వ తరగతి) 400 మీటర్ల హర్డిల్స్‌లోనూ, అండర్-17 బాలుర విభాగంలో టి.రవి శంకర్ (10వ తరగతి) 5 కిలోమీటర్ల రేస్ వాక్‌లోనూ, వి.నారిబాబు (10వ తరగతి) హై జంప్, 400 మీటర్ల హర్డిల్స్‌లోనూ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 3, 4 తేదీల్లో శ్రీకాకుళంలో జరుగు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొంటారని ప్రధానోపాధ్యాయులు దేవుపల్లి నరసింహమూర్తి శనివారం తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, పిడి ఆర్.తమ్మునాయుడును వేచలం సర్పంచ్, ఎంపిటిసి, తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆధార్ కార్డుల్లో తప్పులతో అగచాట్లు

- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
- మీ సేవా, సచివాలయాల్లో ఆప్షన్ ఇవ్వాలని వేడుకోలు

ప్రజాశక్తి-చోడవరం

ఆధార్ కార్డులు మంజూరు సమయంలో దొర్లిన తప్పుల వల్ల విద్యార్థులు తీవ్ర అగచాట్లు పడుతున్నారు. వాటిని సరిదిద్దుకోవడానికి తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తోంది. తప్పులు సరిచేసుకోవడానికి చోడవరం మీసేవా కేంద్రానికి ప్రతి రోజూ వందల సంఖ్యలో విద్యార్థులు వస్తున్నారు. రోజుకు 25 మందికి కంటే ఎక్కువ చేయలేమని మీ సేవా కేంద్రం నిర్వాహకులు చేతులెత్తేయడంతో విద్యార్థులు రోజూ పడిగాపులు కాయాల్సి వస్తోంది. గతంలో ఆధార్ కార్డులు నమోదు చేసేటప్పుడు ఇంటి పేర్లు, ఊరు, తల్లిదండ్రుల పేర్లు, పుట్టిన తేదీ వంటివి తప్పులు పడ్డాయి. వాటిని సరిదిద్దడానికి తమ కేంద్రంలో ఆప్షన్ లేదని మీ సేవా నిర్వాహకులు చెబుతున్నారు. పుట్టిన తేదీ సవరించుకోవడానికి పుట్టిన తేదీ సర్టిఫికెట్స్ తీసుకురావాలని చెప్పడంతో గతంలో సర్టిఫికెట్లు చేయించుకోలేని వారు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. పదవ తరగతి పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు పరీక్షకు హాజరయ్యే ముందు అన్ని సక్రమంగా ఉంటే తప్ప పరీక్షలు రాయడానికి వీలులేదని విద్యాశాఖాధికారులు చెబుతుండడంతో విద్యార్థుల్లో ఆందోళన మొదలైంది. జిల్లా ఉన్నతాధికారులు చొరవ తీసుకుని మీసేవ కేంద్రాల ద్వారా, గ్రామ సచివాలయాల ద్వారా సరిదిద్దుకునే అవకాశం కల్పించాలని విద్యార్థులు కోరుతున్నారు.

మీ సేవా కేంద్రం వద్ద ఎదురుచూస్తున్న విద్యార్థులు

క్రీడా ప్రాధికారిక సంస్థ చైర్మన్‌కు సత్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి

ఎపి క్రీడా ప్రాధికారిక సంస్థ చైర్మన్ ఎ.రవి నాయుడు శనివారం ఉమ్మడి విశాఖ జిల్లా అభివృద్ధి సమావేశాలు కోసం విశాఖపట్నం విమానాశ్రయానికి విచ్చేసిన సందర్భంగా క్రీడా సంఘాల తరపున స్వాగతం పలికి సత్కరించారు. కార్యక్రమంలో పలు క్రీడా సంఘాల ప్రతినిధులు హర్షవర్ధన్, కేవన్సి సత్యనారాయణ, కంచరాన సూర్యనారాయణ, నారాయణరావు, లలిత కుమార్, మన్నాజీ, ఈశ్వరరావు, కరుణ్ కుమార్, రామచంద్రరావు, వి.శ్రీనివాసరావు, గణపతి రావు, గణేష్ పాల్గొన్నారు.

యోగా తరగతులు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జార్జి క్లబ్ ఆవరణలో ఐదు రోజులు ప్రత్యేక యోగా శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మధు మేహ వ్యాధికి హరిద్వార యోగ పీఠం నుండి స్వామి రిత్ దేవ్ మహారాజ్, జార్జ్ క్లబ్ అధ్యక్షులు జోగి నాయుడు, యోగ గురువులు దొరమ్మ నాయుడు పాల్గొన్నారు. సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలంటే కొన్ని ప్రత్యేక ఆసనాలను తప్పనిసరి పాటిస్తూ మంచి ఆహారపు అలవాట్లను చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జార్జ్ క్లబ్ ప్రతినిధులు, పట్నంలోని పలు ప్రాంతాల నుంచి సుమారు 100 మంది పాల్గొన్నారు.

బిఆర్‌టి కాలనీలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని పిసినికాడ శివారు బిఆర్‌టి కాలనీలో మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి నియోజకవర్గం సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ మాట్లాడుతూ వైద్య శిబిరం ద్వారా పరిసర ప్రాంతాల ప్రజలకు సేవలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు మందపాటి జానకిరామరాజు, జాజుల రమేష్, కలగా గున్నయ్య నాయుడు, టిడిపి నేత మళ్ల సురేంద్ర, డాక్టర్స్ బొడ్డేడ నరసింహారావు, ఎస్ సురేష్ కుమార్, పిజే కృపాకర్, పార్టీ నాయకులు మళ్ల శ్రీనివాసరావు, బుద్ద రాజు, యల్లపు వెంకట్రావు, ఆకుల నానాజీ, బీటీ కుమార్ పాల్గొన్నారు.

వరి పంటలో పొటాష్ లోపం ఉంది

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రస్తుతం జిల్లాలో వరి పంటకు పొటాష్ లోపం స్పష్టంగా కనిపిస్తుందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పరిశోధన సహ సంచాలకులు డాక్టర్ ముకుందరావు పేర్కొన్నారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్‌లో శనివారం జరిగిన శిక్షణ సందర్భన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతులు సమగ్ర ఎరువుల విధానాన్ని పాటించి ఈ లోపాన్ని సరిదిద్దుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ ప్రతినిధి శ్రీధర్, ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు డాక్టర్ పివికే.జగన్నాథరావు, రమణమూర్తి, పీవీ పద్మావతి, ఎంబిజివిఎస్.కుమారి, ఉమామహేశ్వరరావు, విశాఖ జిల్లా వ్యవసాయ శాఖ ప్రతినిధి సుబ్రహ్మణ్యం, వివిధ మండలాల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

ప్రజలపై భారాలు వేస్తున్న కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి-కె.కోటపాడు : తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా రాష్ట్రంలో ఉన్న పేద వర్గాలపై మోయలేని భారాలను వేస్తుందని సిపిఐ మండల కార్యదర్శి గొర్లె దేవుడుబాబు విమర్శించారు. మండలంలోని మర్రివలస గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మద్యం ధరలు తగ్గించామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుందని, నిజానికి వైసిపి ప్రభుత్వంలో పరిమితంగా అమ్మే మద్యాన్ని, నేడు విచ్చలవిడి చేశారని పేర్కొన్నారు. అధికార పార్టీ నాయకులే గ్రామాల్లో బహిరంగ వేలం నిర్వహించి మద్యాన్ని అమ్ముతున్నారని విమర్శించారు. ఉచిత ఇసుక అని చెబుతున్నారు తప్పా ఎక్కడా ఉచితంగా ఇసుక లభ్యం కావడం లేదని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు రెడ్డి అప్పలనాయుడు, సీమసిరి సూర్యనారాయణ, ఇల్లాకు రాము, సీమసిరి రామునాయుడు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీకి చంద్రబాబు తూట్లు

ప్రజాశక్తి-అనకాపల్లి : నిరుపేదలకు ఖరీదైన వైద్యం అందిస్తున్న ఆరోగ్యశ్రీ పథకానికి చంద్రబాబు కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తుందని సిపిఐ అనకాపల్లి జోనల్ కార్యదర్శి వైఎన్ భద్రం ఆరోపించారు. గత ప్రభుత్వంలో పేద రోగులకు ఆపరేషన్లకు ఆరోగ్య కింద రూ.25 లక్షల వరకు వైద్య సేవలు అందించగా, నేటి కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ వైద్య సేవగా పేరు మారుస్తూ వైద్య ఖర్చులను రూ.5 లక్షలకు కుదించడం దుర్మార్గమన్నారు. ఆరోగ్యశ్రీ కింద 3255 వ్యాధులకు చికిత్స అందిస్తుండగా, ఇప్పుడు వాటిని సగానికి సగం 1900 వ్యాధులకు కుదించడం అన్యాయమన్నారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని ఎత్తివేసి ప్రజారోగ్యాన్ని ప్రైవేటు ఆరోగ్య బీమా సంస్థలకు దారాదత్తం చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు ఆరోపించారు.

సంక్రాంతి కానుకలకు

అనకాపల్లి బెల్లాన్ని కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం

సంక్రాంతి కానుకలకు ప్రభుత్వం అనకాపల్లి బెల్లాన్ని కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు డిమాండ్ చేశారు. మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో శనివారం గ్రామ ఉపసర్పంచ్ భీమిశెట్టి రాము అధ్యక్షతన బెల్లం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ కేజీ బెల్లానికి రూ.70 చొప్పున ధర ప్రకటించాలన్నారు. అనకాపల్లి చెరుకు పరిశోధన కేంద్రం ద్వారా కొత్త చెరుకు రకాలను తయారు చేసి రైతులకు నేరుగా సరఫరా చేయాలని కోరారు. ఆర్థికపరమైన నష్టాలలో మునిగిపోతున్న రైతులను ఆదుకోవాలన్నారు. అనకాపల్లి వర్తక సంఘం అధ్యక్షులు కొణతాల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఈ ప్రాంత రైతులు 10 కేజీల బెల్లం దిమ్మలను తయారు చేస్తున్నారని, దానికి బకెట్లు ఫ్రీగా సరఫరా చేస్తామని తెలిపారు. కేజీ బరువు గల అచ్చులుగా బెల్లాన్ని తయారు చేస్తే మార్కెటింగ్ సదుపాయం బాగుంటుందన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి బెల్లం మన ప్రాంతానికి రావడం వలన మార్కెట్లో బెల్లానికి గిట్టుబాటు ధర తగ్గిపోతుందని చెప్పారు. ఈ సమావేశంలో శరగడం శివ బాబునాయుడు, ఆడారి నర్సింగరావు, ఆడారి లక్ష్మణ్‌రావు, రైతులు పాల్గొన్నారు.

గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని పలు గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు చేపట్టారు. మొగలిపురం, సబ్బవరం పంచాయితీలో ఈఓపిఆర్‌డి చైతన్య సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలతో కలిసి శ్రమదానం చేశారు. అనంతరం ఎన్‌డబ్ల్యుపిసి షెడ్ వద్ద వానపాములు విడుదల చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి, మొగలిపురం సర్పంచ్ గండి అరుణ, సబ్బవరం సర్పంచ్ డి.ప్రసాదరావు, ఈఓ శ్రీనివాసరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని కె.ఎం.పాలెం పంచాయితీలో శనివారం చెత్త నుండి సంపద తయారీ కేంద్రం వద్ద తుప్పలు డొంకలను తొలగించి శుభ్రం చేశారు. గ్రామంలో వీధులన్నీ శుభ్రం చేసి మురికితో నిండిన డ్రైనేజీల్లో పూడిక తీశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంధం జగన్నాథం, నాయకులు ఎల్ లింగన్న, సచివాలయ సిబ్బంది, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని గుల్లేపల్లి, చౌడువాడ గ్రామాల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమాలు చేశారు. ఎంపీడీవో సాంబశివరావు చౌడువాడలోని చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు దాడి ఎరుకనాయుడు, బండారు దేముళ్ళు, ఎంపీటీసీ ఏటుకూరి అప్పలరాజు, చౌడువాడ పంచాయతీ కార్యదర్శి మహేష్, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ వేచలపు సత్యనారాయణ పాల్గొన్నారు.

కోటవురట్ల : మండలంలోని బికే పల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ లింగన్న నాయుడు ఆధ్వర్యంలో స్వచ్ఛతే కార్యక్రమం నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతపై ర్యాలీ చేపట్టారు. ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు చెత్త నుండి సంపద కేంద్రాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్‌డి రఘురాం పాల్గొన్నారు.

నక్కపల్లి : మండలంలోని నక్కపల్లి, గొడిచర్ల, వేంపాడు గ్రామాల్లో సంపద తయారీ కేంద్రాల వద్ద శ్రమదానంతో పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీతారామరాజు, వేంపాడు సర్పంచ్ నూకరత్నం, ఇన్చార్జి ఈఓపిఆర్డి శ్రీను పాల్గొన్నారు.

గొలుగొండ : మండలంలోని కొత్తఎల్లవరం, చీడిగుమ్మల గ్రామాల్లో శనివారం స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంపద తయారీ కేంద్రాల వద్ద పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమాల్లో కొత్త ఎల్లవరం సర్పంచ్ కొల్లు రాంబాబు, వెలుగు ఏపీఎం కరుణానిధి, చీడిగుమ్మల పంచాయతీ కార్యదర్శి దుర్గ, ఆశ, అంగన్వాడీలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు సంస్కృతి విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-పరవాడ : రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలకు మండలంలోని సంస్కృతి గ్లోబల్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. గత నెల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అరకులో జరిగిన ఆర్చరీ పోటీలలో సంస్కృతి గ్లోబల్ స్కూల్ విద్యార్థులు వి.ఆద్య, పి.అరియానా, ఎ.చారుహాసిని, కె.సాయిమనస్విని, బి.వైష్ణవి, పూర్వ్ రాథోడ్, ఎన్.తేజేశ్వరరావు, పి.సాహిత్ కృష్ణంరాజు, వి.సాకేత్ రామ్‌లు ప్రతిభ కనబర్చారు వీరు పార్వతీపురంలో జరుగు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్. సీతాలక్ష్మి తెలిపారు. ఈ క్రీడాకారులు, కోచ్‌లను సంస్కృతి గ్లోబల్ స్కూల్ సీఈఓ కె.నిశాంత్ అభినందించారు.

వుషు పోటీలకు ఎంపిక

శ్రీకాకుళంలో జరగనున్న రాష్ట్రస్థాయి వుషు పోటీలకు సంస్కృతి గ్లోబల్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. గత నెల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా వుషు పోటీలలో స్కూల్ విద్యార్థులు బి.విక్టర్, రాహుల్ మిస్త్రీ, పి.అభినవ్, వి.సంజయ్, సి.హెచ్.సహజ్, క్రిస్‌దేవ ప్రతిభ కనబర్చారు. వీరిని కోచ్ రమ్యను స్కూల్ సీఈఓ కె.నిశాంత్ అభినందించారు.

జ్యోతిర్లింగ క్షేత్రంలో కార్తీకమాసం పూజలు

ప్రజాశక్తి-సబ్బవరం

మండలంలోని ఆరిపాక పంచాయతీ శివారు పెదయాతపాలెం గ్రామంలో శ్రీగౌరీ పరమేశ్వర సహిత ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రంలో శనివారం కార్తీకమాసం పూజలు ప్రారంభమయ్యాయి. విశాఖ డెయిరీ డైరెక్టర్ శరగడం శంకర్రావు, క్షేత్రం ఉత్సవ కమిటీ నిర్వాహకులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అన్ని కార్తీక సోమవారాలు మహా అన్నసమారాధనలు, భజనలు, సంకీర్తనలు, కోలాటాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 15న కార్తీక పౌర్ణమి రోజున సాయంత్రం 6 గంటల నుండి 20 లక్షల మహాదీపార్చన కార్యక్రమం జరుగుతుందని వెల్లడించారు.

రైల్వే స్టేషన్‌లో పార్శిల్ బుకింగ్ కౌంటర్ మూసివేత తగదు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో పార్శిల్ బుకింగ్ కౌంటర్ మూసివేత తగదని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ అన్నారు. ఈ మేరకు శనివారం రైల్వే ఉన్నతాధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనకాపల్లి, అచ్యుతాపురం, నర్సీపట్నం, చోడవరం, మాడుగుల, పాడేరు, అరకు ప్రజల అవసరాలను ఈ బుకింగ్ కౌంటర్ తీర్చుతుందని చెప్పారు. ఈ సమస్యను రైల్వే స్టాండింగ్ కమిటీ సభ్యులు సీఎం రమేష్ దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందని చెప్పారు.

మూడో రోజుకు పంచరాత్రుల ఉత్సవాలు

ప్రజాశక్తి-యలమంచిలి : స్థానిక తులసీనగర్, పాతవీధిలో ప్రారంభమైన భూలోకమాంబ, సుబ్రహ్మణ్యేశ్వర పంచరాత్రుల మహోత్సవాలు ప్రారంభమై శనివారం నాటికి మూడో రోజుకు చేరుకున్నాయి. ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసే సాంస్కృతిక కార్యక్రమాలు, లైటింగ్ తిలకించడానికి సాయంత్రం 6 గంటల నుంచి అర్ధరాత్రి వరకూ భక్తులు పోటెత్తుతున్నారు. వారందరికీ ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. శనివారం గౌరీ పరమేశ్వరుల విగ్రహా ఆవిష్కరణ జరిగింది. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ ఆడారి ఆనందకుమార్, మున్సిపల్ చైర్మన్ రమాకుమారి, నిర్వాహకులు పైడికొండ, అశోక్, రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

కెజిహెచ్‌కు వెళ్లి పింఛను అందజేత

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని తాళ్లపాలెం పంచాయతీ సంత మార్కెట్ గ్రామానికి చెందిన అమిరిశెట్టి నూకరాజు అనారోగ్యం కారణంగా ఇటీవల విశాఖలోని కింగ్ జార్జ్ ఆసుపత్రిలో చేరి వైద్య సేవలు పొందుతున్నారు. శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ రెండోవ రోజు తాళ్లపాలెం సచివాలయం-2 డిజిటల్ అసిస్టెంట్ హరిణి తన సొంత ఖర్చులతో విశాఖలోని ఆసుపత్రికి వెళ్లి పింఛను రూ.4వేలు అందజేశారు. నూకరాజు కుటుంబ సభ్యులు హరిణికి కృతజ్ఞతలు తెలిపారు.

చెరువును తలపిస్తున్న రహదారి

ప్రజాశక్తి- అనకాపల్లి : స్థానిక నరసింగరావుపేట బిఎస్ఎన్ఎల్ ఆఫీస్ వద్ద మురికినీటి కాలువల నిర్మాణం లేకపోవడంతో చిన్నపాటి వర్షానికే చెరువును తలపించే విధంగా రహదారి ఉందని బిఎస్పి ఇన్చార్జ్ సూదికొండ మాణిక్యాలరావు అన్నారు. ఈ మేరకు శనివారం మాణిక్యాలరావు, దళిత ప్రజా సంఘం నేత కొల్లి సత్యారావు నిరసన తెలిపారు.

రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభం

నక్కపల్లి మండలంలో ప్రారంభిస్తున్న నాయకులు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని ఉద్దండపురం నుండి తిరుపతిపాలెం వెళ్లే రోడ్డు పరమ్మతు పనులను శనివారం తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, పలువురు నాయకులు ప్రారంభించారు. రోడ్డు పూర్తిగా గోతులమయంగా మారడంతో ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో రోడ్ల నిర్మాణాలు చేపట్టనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొప్పిశెట్టి బుజ్జి, సుధాకర్, వైభోయిన రమణ, పొడగట్ల రమణ, మెరుగు నాగేశ్వరరావు, తాతారావు, నానేపల్లి రాఘవ, దార్ల కృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం -కృష్ణదేవిపేట ప్రధాన రహదారిలో గుంతలను శనివారం పూడ్చే కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు పైల గోవిందు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,గుంతలు ఉన్న రోడ్లతో ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోయిన సంఘటనలు ఎన్నో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ ఇంజనీర్లు ప్రసాద్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

అనకాపల్లి : మండలంలోని తుమ్మపాల- మార్టూరు జంక్షన్ వద్ద రోడ్ల మరమ్మతుల కార్యక్రమాన్ని స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ పాలనలో రాష్ట్రంలో రోడ్లు చెరువులను తలపించాయన్నారు. రానున్న సంక్రాతి నాటి కల్లా

నర్సీపట్నంలో పనులు ప్రారంభిస్తున్న నాయకులు

అనకాపల్లి నియోజకవర్గంలో గుంతలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, జనసేన, తెలుగుదేశం, బిజెపి నాయకులు అధికారులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు నమోదు పత్రాలు అందజేస్తున్న నేతలు

ఫిషరీస్ డిజిటల్ కార్డులకు వివరాలు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి- నక్కపల్లి:మత్స్యకారులు ఫిషరీస్ డిజిటల్ కార్డులకు వివరాలు నమోదు చేయించుకోవాలని మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షులు గోసల తాతారావు కోరారు. మండలంలోని రాజయ్యపేటలో శనివారం ఫిషరీస్ డిజిటల్ కార్డులు నమోదు ప్రక్రియను ప్రారంభించారు. 18 సంవత్సరాలు నిండిన మత్స్యకారులందరూ సచివాలయంకు వచ్చి నమోదు చేయించుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి మత్స్య కిషన్ అభివృద్ధి సహ్ - యువజన పథకంలో భాగంగా నేషనల్ ఫిషరీస్ డిజిటల్ ప్లాట్ఫారం సమగ్ర డేటా రిజిస్ట్రేషన్‌కు సిఎస్‌సి ద్వారా అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, ఎంపీటీసీ సభ్యులు పిక్కి సత్తియ్య, టిడిపి నాయకులు కురందాసు నూకరాజు, కొప్పిశెట్టి బుజ్జి, కోదండరావు, పిక్కి గంగరాజు, గింజాల లక్ష్మణరావు, మెరుగు నాగేశ్వరరావు, పిక్కి దేముడు, వాసపల్లి రాము పాల్గొన్నారు.

వడ్డిస్తున్న విజయ్

అన్న సమారాధన ప్రారంభం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :స్థానిక స్వామి అయ్యప్ప ఆలయంలో ఐదు సంవత్సరాలుగా నిర్వహిస్తున్న అన్నసమారాధన కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది కూడా ప్రారంభమైంది. కార్తీక మాసం సందర్భంగా ప్రతిరోజూ అయ్యప్ప స్వామి భక్తులకు అన్నసమారాధన నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మొదటి రోజు అన్నసమారాధనకు విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమాన్ని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆయిల్ ఫామ్ సాగుకు..

రాయితీలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని పాకలపాడు గ్రామంలో శనివారం ఆయిల్ పామ్ పంట ప్రాముఖ్యత, యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సంద్భంగా ఉద్యానశాఖ అధికారి ఎస్.శిరీష ఆయిల్ పామ్ పంట విస్తీర్ణంను ప్రోత్సహిస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న ఉద్యాన పథకాలను వివరించారు. ఆయిల్ పామ్ మొక్కలపై 100 శాతం రాయితీ, ఎరువులపై 50 శాతం రాయితీని నాలుగు సంవత్సరాల పాటు వాటిలో అంతర పంటలపై 50 శాతం రాయితీని ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఆర్‌కేవిఎంవై పథకం కింద జీడిమామిడి, మామిడి, బొప్పాయ, జామ, కోకో, కొబ్బరి పంటను కొత్తగా వేసుకునే రైతులకు ప్రభుత్వం పలు సబ్సిడి పథకాలు అందజేస్తుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఆయిల్ పామ్ కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ రమేష్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ యాజమాన్య పద్ధతులను గురించి వివరిస్తూ అధిక దిగబడులు అర్జించే

అవగాహన కల్పిస్తున్న ఉద్యావన అధికారి

మార్గాలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ దుర్గాదేవి, ఎంపిఈఒ శివ, ఫీల్డ్ మేనేజర్ సత్తిబాబు, గ్రామ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తహశీల్దార్

నీటి సంఘాల ఓటర్ల జాబితాలను సిద్ధం చేయాలి

ప్రజాశక్తి -రావికమతం: నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాలను సిద్ధం చేయాలని తహసిల్దార్ వెంకటరమణ ఆదేశించారు. రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మండలంలో కళ్యాణపులోవ, కామునిగడ్డ, ముంత మామిడి కట్టు, పెద్దకట్టు తదితర నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ మేరకు ఆయా సంఘాల ఆయికట్టు పరిధి విఆర్వోలు ఓటర్ల జాబితా తయారు చేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో వచ్చిన ఫిర్యాదులపై సమగ్ర విచారణ నిర్వహించి నివేదికలు అందజేయాలని కోరారు. ముటేషన్ విషయంలో జాప్యం జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిన సమాచారం మేరకు క్షేత్రస్థాయిలో నిర్ణీత సమయంలో విచారణ జరిపి నివేదికను కార్యాలయానికి అందజేయాలని తెలిపారు. అలసత్వం వహించిన అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ జి. అప్పలనాయుడు, రీ సర్వే డిప్యూటీ తహసిల్దార్ నానాజీ, ఎంఆర్ఐ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే సమస్యలపై అర్జీల స్వీకరణ

బుచ్చయ్యపేట మండలం దిబ్బిడిలో మాట్లాడుతున్న తహశీల్దార్

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని బోదువలస పంచాయితీలో శనివారం జరిగిన రెవిన్యూ సదస్సులో భూ రీ సర్వే సమస్యలపై 126 అర్జీలు అందినట్లు రీ సర్వే డిటి గణేష్ తెలిపారు. ఈ అర్జీలపై దర్యాప్తు చేసి తగు చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ అప్పారావు, విఆర్వో ఎం.గోవిందరావు, సర్పంచ్ నేబర్తి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ బుదిరెడ్ల రామకృష్ణ, గంతకోరు సూర్యనారాయణ, కొట్యాడ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

పలుచోట్ల గ్రామసభలు

బుచ్చయ్యపేట : మండలంలోని దిబ్బిడి, చిన్నప్పన్నపాలెం రెవెన్యూ సదస్సుల్లో మండల తహశీల్దార్ ఎం.లక్ష్మి పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచులు కోవెల ఈశ్వరరావు, పెడిరెడ్ల మాణిక్యం, ఎంపీటీసీ గొంపా వెంకటేశ్వరరాజు, మాజీ ఎంపీటీసీ గోన్నాబతుల శ్రీనివాసరావు, సానపతి శ్రీనివాసరావు, ఆర్ఐ శ్రవణ్, విఆర్ఒ సత్తిబాబు, సర్వేయర్ గణేష్, రైతులు పాల్గొన్నారు.

గుర్రంపాలెంలో గ్రామ సభ

పెందుర్తి : మండలంలోని గుర్రంపాలెం గ్రామంలో రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం శనివారం గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ అనంతవరం మాట్లాడుతూ, భూ రీ సర్వేలో జరిగిన తప్పులను సరిచేయడానికి ఈ గ్రామసభ నిర్వహించినట్లు తెలిపారు. సమస్యలను నెల రోజుల్లో పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్, సర్వేయర్, సర్పంచ్ ఉగ్గిన గోవింద్, రైతులు పాల్గొన్నారు.

నక్కపల్లి:మండలంలోని దోసలపాడు గ్రామంలో శనివారం తహసిల్దార్ నరసింహమూర్తి రెవిన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ, గ్రామంలో నిర్వహించిన రీ సర్వేలో తప్పిదాలు, పొరపాట్లు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకు వస్తే సమస్య పరిష్కరిస్తామన్నారు. పలువురు రైతులు తహసిల్దార్‌కు అర్జీలను అందజేసారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఉద్యోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నక్కపల్లి మండలం దోసలపాడులో వినతిని ఇస్తున్న రైతులు

అవగాహన కల్పిస్తున్న అధికారులు

స్కిల్ సర్వేపై శిక్షణ

ప్రజాశక్తి -నక్కపల్లి:స్కిల్ డెవలప్మెంట్ సర్వేపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో డి సీతారామరాజు సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, మహిళా పోలీస్‌లకు స్కిల్ డెవలప్మెంట్ సర్వేపై శిక్షణ ఇచ్చారు. స్కిల్ డెవలప్మెంట్ కొరకు గ్రామాల్లో ఏ విధంగా సర్వే చేయాలి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ఈ ఓ పి ఆర్ డి.శ్రీను పాల్గొన్నారు.

అపారిశుధ్యానికి కేరాఫ్ ఎస్.రాయవరం

-రోడ్డుపైనే మురుగునీరు -డ్రెయినేజీల్లో చెత్తాచెదారం - పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి -ఎస్.రాయవరం: మండలకేంద్రం మేజర్ పంచాయితీ యస్.రాయవరం అపారిశుధ్యం తాండవిస్తోంది. సుమారు ఎనిమిది వేల జనాభా కలిగిన ఈ మేజర్ పంచాయితీలో కాలువల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండటంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో, గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు ముఖ్యంగా ఎస్.రాయవరం నుండి లింగరాజుపాలెం వెళ్ళే మెయిన్ రోడ్డు, నూకాలమ్మ గుడిపక్క నుండి పోలీసు స్టేషన్‌కు వెళ్ళే రోడ్డులో మురుగునీరు ఎప్పుడూ ప్రవహిస్తూ ఉంటోంది. గ్రామంలో మెయిన్ రోడ్డులో కాలువలపై పలకలు ఉండటంతో ఎక్కడికక్కడ కాలువలు పూడుకుపోయి రోడ్లపైకి మురుగునీరు చేరుతుంది. గొల్లవీధి మంచినీటి కుళాయి వద్ద అపారిశుధ్యంతో దురువాసన వస్తోంది, మంచినీరు పట్టుకోవడానికి వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురువుతున్నారు తెలిపారు. అపారిశుధ్యంతో దోమలు వృద్ధి చెందు తున్నాయి. దోమకాటుతో అనారోగ్యం పాలవుతున్నామని స్థానికులు తెలిపారు. అధికారులు కాలువల్లో పూడిక తీసి నీరు నిల్వ లేకుండా, రోడ్లపైకి మురుగునీరు రాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గొల్లవీధిలో కుళాయి వద్ద మురుగునీరు

మురుగునీరు ప్రవహిస్తున్న ఎస్.రాయవరం నుంచి లింగరాజుపాలెం వెళ్లే రహదారి

మాట్లాడుతున్న సిపిఎం నేత అప్పలరాజు

రోడ్డు మరమ్మతు చేపట్టాలి

- సిపిఎం నేతల ధర్నా

ప్రజాశక్తి- ఎస్.రాయవరం : అడ్డరోడ్డు నుండి నర్సీపట్నం వెళ్ళే ప్రధానమైన రహదారి మరమ్మత్తులు వెంటనే చేపట్టాలని సిపియం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అప్పలరాజు డిమాండ్ చేశారు. శనివారం ఉదయం అడ్డురోడ్డులో సిపిఎం ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. అడ్డరోడ్డు నుండి కోటవురట్ల మండలం అల్లుమియ్యాపాలెం జంక్షన్ వరకు పెద్ద పెద్ద గోతులతో
ప్రయాణం నరక ప్రాయంగా మారిందన్నారు. వాహనదారులు, ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులు ప్రభుత్వం గుర్తించి వెంటనే రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరారు.రోడ్డు మరమ్మతులు చేయకపోతే నర్సీపట్నం రోడ్డు దిగ్బంధం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండలం కన్వీనర్ ఎం.సత్యనారాయణ, దుర్గా ప్రసాద్, సిహెచ్.అప్పారావు, బి.నరేంద్ర, జీ.రమణ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తహశీల్దార్

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలి

ప్రజాశక్తి -కోటవురట్ల: ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడంలో దిగువ స్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తహసిల్దారు తిరుమల బాబు సూచించారు. శనివారం కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన గ్రామ రెవెన్యూ సహాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక అక్రమ రవాణా జరగకుండా మండలంలో వరాహ, సర్పనది పరివాహక ప్రాంతాల్లో ఇసుక వనురులను కాపాడాలన్నారు. పందూరు, కైలాసపట్నం, చౌడవాడ, గొట్టువాడ, రాజుపేట గ్రామాలలో వనరులపై పూర్తి నిఘా ఏర్పాటు చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలకు బాధ్యులవుతారని తెలిపారు ఈ కార్యక్రమంలో డిటి రమేష్, సీనియర్ అసిస్టెంట్ కృష్ణ, ఆర్ఐ ఊర్ధవరావు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌తో తొలగిస్తున్న తుప్పలు

తుప్పల తొలగింపు

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలో పాములవాక గ్రామ పంచాయతీ పరిధిలో ప్రధాన రహదారికి అనుకొని ఉన్న తుప్పలను గ్రామపంచాయతీ అధికారులు తొలగించడం పట్ల స్థానికులు, వాహన చోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జరిగిన మండల పరిషత్ సమావేశంలో సర్పంచ్ సత్యవతి రోడ్డు ఇరువైపులా పెరిగిన తుప్పలు తొలగించాలని కోరగా స్పందించిన పంచాయితీ అధికారులు తుప్పలు తొలగిస్తున్నారు. తుప్పలు పెరిగి పోవడంతో ప్రమాదాలు సైతం చోటు చేసుకునేవి. తుప్పల కారణంగా విషసర్పాలు సైతం సంచరిస్తూ వుండేవి. దీంట్లో రైతులు, పాదచారులు ఆందోళన ఆందోళన చెందేవారు. తుప్పల తొలగించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గుంతల లేని రోడ్లు ప్రభుత్వ లక్ష్యం

పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

పనులు ప్రారంభిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: రాష్ట్రంలో ప్రజలు గుంతలు లేని రహదారులపై సురక్షితంగా ప్రయాణం చేయడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర పౌర సరఫరాలు, ఆహారం, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి, జనసేన పిఎసిఎస్ చైర్మన్ నాదెండ్ల మనోహర్ తెలిపారు. శనివారం డాల్ఫిన్ జంక్షన్ (రామకృష్ణ జంక్షన్ రోడ్డు) వద్ద రోడ్లపై గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా గుంతలేని రహదారి నిర్మాణం కోసం కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. వైసిపి పాలనలో రోడ్లు పెద్ద పెద్ద గుంతలతో ఏర్పడిన సందర్భంలో, జగన్ మోహన్ రెడ్డిని నిద్ర లేపడం కోసం గుడ్ మార్నింగ్ సిఎం సార్ అనే కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా చేయడం జరిగిందన్నారు. రహదారులు సరిగా లేక ప్రజలు ఏ విధంగా ఇబ్బంది పడుతున్నారో, సోషల్ మీడియా వేదికగా ప్రజలకు తెలియజేయడం జరిగిందన్నారు.రోడ్ల అభివృద్ధి కోసం తమ పార్టీ కార్యకర్తల సొంత నిధులతో, కొన్ని ప్రాంతాల్లో రోడ్లు నిర్మించడం జరిగిందన్నారు.ఈ గుంతలను పూడ్చడానికి రూ.890 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని చెప్పారు.రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ, రోడ్ల మెరుగు కోసం ముందుకు వచ్చిందన్నారు.కూటమి ప్రభుత్వం పాలనలో అంకితభావంతో పనిచేయాలనే ఉద్దేశంతో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో విశాఖ నగరంలోని రోడ్లను మరింత అభివృద్ధి చేస్తామన్నారు.

ఎమ్మెల్యే వంశీకష్ణ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జనసేన పిఎసిఎస్ సభ్యులు కోన తాతారావు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు తమ్మి రెడ్డి శివశంకర్, బొలిశెట్టి సత్యనారాయణ, పసుపులేటి ఉషాకిరణ్, టిడిపి దక్షిణ ఇంచార్జ్ సీతంరాజు సుధాకర్,పి. శివ ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన

ఎమ్మెల్సీ వరుదు కల్యాణి

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: కూటమి పాలనలో రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగ అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ధ్వజమెత్తారు. శనివారం సాయంత్రం విశాఖలో తన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, చంద్రబాబు పాలనలో మహిళల మాన ప్రాణాలు గాల్లో దీపాలుగా మారి పోయాయన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఉన్నామా.. ఆటవిక రాజ్యంలో జీవిస్తున్నామా అనే అనుమానం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేసారు. ప్రభుత్వం చేతగానితనం కారణంగా రాష్ట్రంలో అత్యాచారాలు, హత్యలకు అడ్డాగా మారిపోయిందని మండిపడ్డారు. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడిన వారిపై నెల రోజుల్లోగా విచారణ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బాధితుల తరపున వైయస్సార్సీపీ ఆందోళన చేస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి పాలనలో 130 రోజుల్లో 130కి పైగా అత్యాచారాలు, దాడులు, హత్యలు, వేధింపులు వంటి ఘటనలు చోటుచేసుకున్నాయని విమర్శించారు. వీటిలో 8 మంది మహిళలు హత్యకు గురికాగా, మరో 5 మంది వేధింపులు తాళలేక ఆత్మహత్యలు చేసుకున్న దుస్థితి ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత జిల్లా చిత్తూరు నగరిలో మూడున్నరేతళ్ల బాలికకు చాక్లెట్స్ ఆశ చూపి మద్యం, గంజాయి మత్తులో దుర్మార్గుడు అఘాయిత్యం చేసి హత్య చేసాడని, అయినా సరే సీఎం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నియోజకవర్గం సమీపంలోనే కడియం మండలం బుర్రి లంకలో మహిళపై గ్యాంగ్ రేప్ చేసి చంపేసి కాలువలో పడేసినా నోరు మెదపడం లేదని దుయ్యబట్టారు.

నేడు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: విశాఖ పోలీస్ బ్యారెక్స్ గ్రౌండ్‌లో ఈనెల 3న అథ్లెటిక్స్ క్రీడాకారుల జిల్లా స్థాయి ఎంపికలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. మాస్టర్ అథ్లెటిక్స్ పేరుతో నిర్వహించే ఈ పోటీలలో ఎవరైనా పాల్గొనవచ్చు అన్నారు. ఈ పోటీలలో 30 సంవత్సరాలు పైబడిన మహిళలు, పురుషులు కూడా పాల్గొనవచ్చు అన్నారు. జిల్లా స్థాయిలో మొదటి, ద్వితీయ,తతీయ స్థానములు పొందిన వారు నేరుగా డిసెంబర్ నెల రెండవ శని, ఆదివారాలలో గుంటూరులో జరగబోవు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారన్నారు.

స.హ చట్టంపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి - రావికమతం: సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఎంపీపీ పైల రాజు సూచించారు. మండల వ్యవసాయ కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సును శనివారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేసుకుంటే దానికి సంబంధించిన సమాచారాన్ని 30 రోజుల లోపు పొందవచ్చునన్నారు. వ్యవసాయ శాఖ అధికారి డీ.రూప మాట్లాడారు. ఎంపీటీసీ వేపాడ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కోటవురట్ల: అధికారులు ప్రజలు అడిగిన సమాచారాన్ని 30 రోజుల్లో అందజేయాలని మండల వ్యవసాయ అధికారిని సరోజిని సూచించారు. మండల వ్యవసాయ కార్యాలయంలో ప్రభుత్వ ఉద్యోగులతో సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అధికారులు సమాచారానికి సంబంధించిన అన్ని రికార్డులు భద్రపరుచుకోవాలని సూచించారు.

ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు మాట్లాడుతూ, పౌరులు అడిగిన సమాచారం అందజేయాలని సూచించారు ఈఓపిఆర్డి రఘురాం, హౌసింగ్ ఏఈ వరప్రసాద్, ఏపీఓ నాగరాజ్ పాల్గొన్నారు.